ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 148

సోమవారం 15 డిసెంబర్ 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## మూడో టీ20లో దక్షిణాఫ్రికా చిత్తు



07



## యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

ఉచిత దర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం

సండే ఆలయానికి రూ.52.72 లక్షల ఆదాయం

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. రద్దీ కారణంగా కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, వ్రత మండపాలు కిక్కిరిశాయి. భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో.. స్వామివారి ఉచిత దర్శనానికి మూడు గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం పట్టింది. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపుసేవతో ముగిశాయి.

# హస్తం హవా

## రెండో విడతలోనూ కాంగ్రెస్‌కు సగానికి పైగా సీట్లు



రెండో దఫా పంచాయతీ ఎన్నికల్లో మరింత భారీగా పోలింగ్ నమోదైంది. తొలివిడత ఎన్నికల్లో 84.28 శాతం పోలింగ్నమోదు కాగా.. రెండో విడతలో 1.58 శాతం ఎక్కువగా 85.86% ఓటింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ప్రకటించింది. మొత్తం మీద రెండో విడత పంచాయతీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రా ల వద్ద ఓటర్లు బారులు తీరారు.

- బీఆర్ఎస్‌కు 25 శాతానికి పైగా సీట్లు
- సిద్దిపేటలో టాప్ గేరులో 'కారు'
- మూడు మినహా అన్ని జిల్లాల్లో వెనుకంజే
- మలి విడతలోనూ పుంజుకోని బీజేపీ
- కేవలం 6 శాతం స్థానాలతోనే సరి..
- రెండో విడతలో 415 స్థానాలు ఏకగ్రీవం

**హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న హస్తం పార్టీ.. మలి విడతలోనూ అదే జోరు కొనసాగించింది. ఆదివారం జరిగిన రెండో విడత

మిగతా 2 లో

### పంచాయతీ పోరులో విషాదాలు

పోలింగ్ రోజునే మరణించిన ఓ అభ్యర్థి

కుమార్తెకు ఓటేసిన కాసేపటికే కన్నుమూసిన తండ్రి



## సత్యానికి అసత్యానికి మధ్య పోరాటం

### బీజేపీ డీఎన్ఏలోనే ఓట్ చోరీ.. కాంగ్రెస్‌లో సత్యం, అహింస

- ఆ రెండింటి ద్వారానే పోరాడి.. మోదీని ఓడించి.. గద్దె దించుతాం
- కేంద్ర ఎన్నికల సంఘం బహిరంగంగా బీజేపీ కోసం పనిచేస్తోంది
- ఓట్‌చోరీలో దొరికిపోయామని మోదీ, షాలకు అర్థమైంది
- సభలో నా ప్రశ్నకు జవాబిస్తున్నప్పుడు షా చేతులు వణికాయి
- సత్యం గెలవడానికి సమయం పట్టొచ్చు.. కానీ తుది గెలుపు మాదే
- 'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేసే కుట్ర: మల్లికార్జున ఖర్గే
- దమ్ముంటే బ్యాలెట్ విధానంలో పోటీ చేసి గెలవండి: ప్రియాంక

04

దేశంలో సత్యానికి, అసత్యానికి మధ్య పోరాటం నడుస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గంలో పోరాడడం ద్వారానే.. నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు.

## రేషన్, ఆధార్ సహా ఆస్తులనూ లాక్కుంటారు



'ఓట్ చోరీ' కాంగ్రెస్ సమస్య కాదు.. దేశ సమస్య: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## జల దోపిడీపై.. ఇక పోరుబాటే

- 19న తెలంగాణ భవన్ కు కేసీఆర్
- బీఆర్ఎస్ఎల్పీ, కార్యవర్గ సమావేశం
- కృష్ణా, గోదావరి జలాల్లో న్యాయం కోసం పోరాటం
- ఉద్యమ కార్యాచరణపై విస్తృతస్థాయి చర్చ

2

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఈ నెల 19న ఆ పార్టీ శాసనసభా పక్షం, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరగనుంది. తెలంగాణ భవన్‌లో జరిగే భేటీలో పార్టీ సంస్థాగత నిర్మాణం, తెలంగాణ సాగునీటి హక్కుల పరిరక్షణకు పార్టీపరంగా చేపట్టాల్సిన ఉద్యమాలు, ప్రజల్లోకి వెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు కేసీఆర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది.



## త్వరలో పునర్వ్యవస్థీకరణ

- మంత్రివర్గం నుంచి పొన్నం, సురేఖను తప్పిస్తారనే వార్తల్లో వాస్తవం లేదు
- నెల రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిటీలు
- బీఆర్ఎస్‌ది ముగిసిన కథ..
- కవితతో ఆ పార్టీకి కొలుకోలేని దెబ్బ
- ఢిల్లీలో మీడియాతో మహేశ్ గౌడ్ ఇష్టాగోష్ఠి

03





## ఇక ప్రభాకర్‌రావు అరెస్టే!

- సిట్ విచారణలో చుక్కలు చూపుతున్న మాజీ ఎస్ఐబీ చీఫ్
- ఫోన్ ట్యాపింగ్‌పై రాజకీయ కోణంలో ప్రశ్నలపై దాటవేత

## బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్!



4

- పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆమోదం
- 45 ఏళ్ల వయస్సులో సరికొత్త రికార్డు
- పిన్న వయస్కుడైన ప్రెసిడెంట్గా పేరు
- ప్రస్తుతం బీహార్ మంత్రిగా నితిన్
- కొత్త ప్రెసిడెంట్కు మోదీ, అమిత్ షా, నడ్డా, నితీశ్ అభినందనలు

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
15 డిసెంబర్
2025






# ఇంధన పరిరక్షణలో తెలంగాణకు రెండోస్థానం

## రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న నవీన్ మిత్తల్

**న్యూఢిల్లీ, డిసెంబరు 14 :** ఇంధన పరిరక్షణలో ఉత్తమ పనితీరుతో దేశ వ్యాప్తంగా తెలంగాణ రెండో స్థానాన్ని సొంతం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీఆర్ఈడీసీఓ) ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ)లో అమలు చేసిన కూల్ రూఫ్ ఆఫ్ డెమో ప్రాజెక్టుకు ఈ అవార్డు దక్కింది. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం జరిగిన జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు-2025 ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ అవార్డునందుకున్నారు.

# జల దోపిడీపై .. ఇక పోరుబాటే

## 19న తెలంగాణ భవన్ కు కేసీఆర్

## బీఆర్ఎస్ఎల్పీ, కార్యవర్గ సమావేశం

## కృష్ణా, గోదావరి జలాల్లో న్యాయం కోసం పోరాటం ఉద్యమ కార్యాచరణపై విస్తృతస్థాయి చర్చ



**హైదరాబాద్, డిసెంబరు 14:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఈ నెల 19న ఆ పార్టీ శాసనసభా పక్షం, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరగనుంది. తెలంగాణ భవన్‌లో జరిగే భేటీలో పార్టీ సంస్థాగత నిర్మాణం, తెలంగాణ సాగునీటి హక్కుల పరిరక్షణకు పార్టీపరంగా చేపట్టాల్సిన ఉద్యమాలు, ప్రజల్లోకి వెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు కేసీఆర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. గోదావరి, కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం కొల్లగొడుతున్నా.. దాన్ని అడ్డుకోవడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని ఆ ప్రకటనలో విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బీఆర్ఎస్ హయాంలో 91 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలంటోందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కేంద్రం వద్ద మోకరిల్లి రాష్ట్ర రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. 8 మంది బీజేపీ ఎంపీలున్నా ప్రయోజనం లేదన్నారు. బీఆర్ఎసలో చోటుచేసుకున్న పరిణామాలు, అంతర్గత సమస్యలపై కూడా పార్టీ ముఖ్యులతో కేసీఆర్ చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రియుడితో భర్తను హత్య చేయించిన భార్య

## ప్రమాదంగా చిత్రీకరించే యత్నం



**పరిగి, డిసెంబరు 14 :** వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ఓ భార్య తన ప్రియుడితో భర్తను హత్య చేయించింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా చౌడాపుర్ మండలంలో జరిగింది. కేసు వివరాలను పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదివారం వెల్లడించారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన కర్రె రత్నయ్య, కవితలు భార్యభర్తలు. వీరికి ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు. రత్నయ్య పొలం పనులు చేస్తుండగా, కవిత ఓ కంపెనీలో లేబర్‌గా పని చేస్తోంది. కవిత అదే గ్రామానికి చెందిన దాసరి రామకృష్ణతో కొన్నేళ్లుగా అక్రమ సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం రత్నయ్య తెలిసి భార్యను పలుమార్లు మందలించాడు. పిల్లలు పెళ్లీడుకోచ్చారని పద్ధతి మార్చుకోమని హెచ్చరించాడు. భర్త హెచ్చరించిన విషయాన్ని కవిత ప్రియుడు రామకృష్ణకు తెలిపింది. ఇద్దరి మధ్య తన భర్త అడ్డుపడుతున్నాడని, అతన్ని చంపేస్తే తాము సంతోషంగా ఉండొచ్చని చెప్పగా కవిత ఒప్పుకుంది. ప్రణాళిక ప్రకారం శనివారం పొలానికి వెళ్ళి వస్తున్న రత్నయ్యను రామకృష్ణ ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. దీంతో రత్నయ్య మృతి చెందాడు. అనంతరం తన భర్త ప్రమాదంలో మృతి చెందాడని కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. రత్నయ్య తమ్ముడు దేవయ్య అనుమానం వ్యక్తం చేయడంతో లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. కవిత, రామకృష్ణలను విచారించగా, నేరాన్ని ఒప్పుకున్నారు. నిందుతులను ఆదివారం రిమాండ్‌కు తెరలించినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

# హస్తం హవా


మొదటి పేజీ తరువాయి


ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే అత్యధిక స్థానాల్లో విజయబావుటా ఎగురవేశారు. మలి విడతలో 192 మండలాల పరిధిలోని 3911 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగ్గా.. 2200కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. మెజారిటీ సీట్లను సాధించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ తన పట్టును నిలుపుకున్నట్లయింది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి కూడా మలి విడత ఫలితాలు కాస్త ఊరటనిచ్చాయి. 1100కు (25 శాతానికి) పైగా సీట్లను గెలుచుకోవడం ద్వారా గ్రామాల్లో తన ఉనికిని చాటుకుంది. మరో ప్రధాన ప్రతిపక్షం బీజేపీకి తొలి విడతతో పోలిస్తే స్వల్పంగా సీట్లు పెరిగాయి. కమ్యూనిస్టులు, ఇతర పార్టీలూ పది శాతానికి పైగా సీట్లను కైవసం చేసుకున్నాయి. మలి విడతలో మొత్తం 4332 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే వీటిలో 415 స్థానాలు ఏకగ్రీవం కాగా.. ఐదు గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 3,911 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. కాగా, రెండో విడతలో గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ రెబల్సే ఉండడం గమనార్హం.

### ఊళ్లలో కాంగ్రెస్ కళకళ

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ దశ మారిపోయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో డీలా పడిన సంగతి తెలిసిందే. గెలిచిన అభ్యర్థులు కూడా రాత్రికి రాత్రే బీఆర్ఎస్ కండువాలు కప్పేసుకున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో క్షేత్రస్థాయిలో హస్తం పార్టీ పరిస్థితి మారిపోయింది. తొలి, మలి విడత సర్పంచ్ ఎన్నికల్లో సగానికిపైగా సీట్లలో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే గెలిచారు. మలి విడతలో మొత్తం 4332 సర్పంచ్ సీట్లకు గాను కడపటి వార్తలు అందేసరికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 2331స్థానాలను గెలుచుకున్నారు. మరోవైపు జిల్లాల వారీగానూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. స్థానిక ఎన్నికలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టారు. దీంతో సిద్దిపేట, ఆసిఫాబాద్, జనగామ మినహా అన్ని జిల్లాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం స్పష్టంగా కనిపించింది. మహబూబ్‌నగర్, సంగారెడ్డి సహా 20 జిల్లాల్లోనైతే సగానికంటే ఎక్కువ సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. ఏకగ్రీవమైన 415 పంచాయతీల్లో 90 శాతానికిపైగా కాంగ్రెసవే కావడం విశేషం. మలి విడత ఎన్నికల ఫలితాల్లోనూ కాంగ్రెస్ హవా కొనసాగడంతో పార్టీ నేతల్లో ఉత్సాహం పెరిగింది.

### బీఆర్ఎస్‌కు కాస్త ఊరట..

రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ



వెనకంజలోనే ఉంది. అయితే ఈ ఎన్నికల్లో 25 శాతానికి పైగా సీట్లను కైవసం చేసుకోవడం ఊరట కలిగించే అంశమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తొలి, రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో 25 శాతానికి పైగా సీట్లు కైవసం చేసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ఆ పార్టీ తన ఉనికిని చాటుకుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది బీఆర్ఎసకు పెద్ద ఊరటేనని విశ్లేషకులు చెబుతున్నారు. మలి విడతలో కడపటి వార్తలు అందేసరికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 1195 సీట్లు గెలుచుకున్నారు. మలి విడతలోనూ కేసీఆర్, హరీశ్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలో బీఆర్ఎస్ హవా కొనసాగింది. ఈ జిల్లాలో మలి విడతలో 186 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా వందకు పైగా సీట్లలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే గెలిచారు. ఇతరులు 36, కాంగ్రెస్ పార్టీ కేవలం 26 సీట్లలో విజయం సాధించాయి. హరీశ్ నియోజకవర్గంలోని 91 పంచాయతీల్లో 78 బీఆర్ఎస్ గెలుచుకోవడం విశేషం. ఇక్కడ కాంగ్రెస్ 5 స్థానాలకే పరిమితమైంది. జనగామ జిల్లాలో కాంగ్రెస్ 30 సర్పంచ్ సీట్లు గెలుచుకుంటే.. బీఆర్ఎస్ 37 సీట్లు సొంతం చేసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు 24, బీఆర్ఎసకు 40 సీట్లు వచ్చాయి.

### మలి విడతలోనూ పుంజుకోని బీజేపీ

రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా ఎదగాలని చూస్తు న్న బీజేపీ.. మలి విడత పంచాయతీ ఎన్నికల్లోనూ తన బలాన్ని చూపలేకపోయింది. కడపటి వార్తలు అందేసరికి ఆ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 250కి పైగా సీట్లలో గెలిచారు. బీజేపీ గెలుచుకున్న సీట్లలో సింహభాగం ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవ ర్గాలవే కావడం గమనార్హం. అంటే మలివిడత ఎన్నికలు జరిగిన పంచాయతీల్లో బీజేపీ వాటా కేవలం ఆరు శాతం.



# పంచాయతీ పోరులో విషాదాలు

## పోలింగ్ రోజునే మరణించిన ఓ అభ్యర్థి

## కుమార్తెకు ఓటేసిన కాసేపటికే కన్నుమూసిన తండ్రి

**నేలకొండపల్లి, చేవెళ్ల :** పంచాయతీ ఎన్నికలు కొన్ని కుటుంబాలకు విషాదాన్ని మిగిల్చాయి. ఓ అభ్యర్థి పోలింగ్ రోజున హఠాత్తుగా మరణించగా, మరో చోట ఎన్నికల బరిలో నిలిచిన తన కూతురికి ఓటేసిన కాసేపటికే తండ్రి చనిపోయాడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామానికి చెందిన దామాల నాగరాజు (40) సర్పంచ్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో నాగరాజు కొద్దిరోజులుగా తీవ్ర ఒత్తిడిలో ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలో నాగరాజు ఆదివారం ఉదయం బ్రెయిన్ డెడ్‌కు గురై మరణించారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో నాగరాజుకు 16 ఓట్లు వచ్చాయి. ఇక, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం వెంకన్నగూడ గ్రామానికి చెందిన పోలిసేట బుచ్చయ్య(70) కుమార్తె రాములమ్మ ఆలూరు పంచాయతీ 14వ వార్డు సభ్యురాలిగా పోటీ చేశారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో భాగంగా ఓటేసిన బుచ్చయ్య పోలింగ్ కేంద్రంలో నుంచి బయటికి వస్తుండగా మూర్ఛ వచ్చి ఆ ఆవరణలోనే కుప్పకూలిపోయాడు. గమనించిన పోలింగ్ అధికారులు బుచ్చయ్యను ఆస్పత్రికి తరలించేటప్పటికే మరణించారు.

### ఓటేసేందుకు వస్తూ మృత్యుఒడిలోకి


ఎన్నికల్లో ఓటేసేందుకు స్వగ్రామాలకు వస్తూ రోడ్డు ప్రమాదాలకు గురై వేర్వేరు ఘటనల్లో ఇరువురు మరణించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మౌలానా ఖేడ్‌కు చెందిన పల్లె సిద్ధిరాములు, సుజాత దంపతులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఎన్నికల్లో ఓటేసేందుకు శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై మౌలానాఖేడ్‌కు బయలుదేరారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలంలోని బాచేపల్లి సమీపంలోని హైవేపై వీరి ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కింద పడ్డ దంపతులు గాయపడ్డారు. దంపతులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా రాములు మార్గమధ్యలోనే మరణించాడు. సుజాత పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. అలాగే, కొత్తగూడెం జిల్లాలోని వేదాంతపురానికి చెందిన నడిది వెంకన్న(27) ఓటేసేందుకు దమ్మపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా అశ్వారావుపేట బస్టాండ్ బయ ఓ వాహనం ఢీకొని మరణించాడు.

# ఇక ప్రభాకర్‌రావు అరెస్టే!

## సిట్ విచారణలో చుక్కలు చూపుతున్న మాజీ ఎస్ఐబీ చీఫ్

## ఫోన్ ట్యాపింగ్‌పై రాజకీయ కోణంలో ప్రశ్నలపై దాటవేత

**హైదరాబాద్, డిసెంబర్ 14 :** తెలంగాణను ఒక కుదుపు కుదిపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, నాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు విచారణలో సిట్ అధికారులకు చుక్కలు చూపిస్తున్నట్టు తెలిసింది. ప్రశ్నించిన ప్రతి అంశానికి సంబంధించి అంతా తనపై అధికారులకు తెలుసని, వారి ఆదేశాల మేరకే తాను వ్యవహరించాలని చెబుతూ వస్తున్నట్టు సమాచారం. రాజకీయ జోక్యానికి, అక్రమాలకు సంబంధించి ఎన్ని ఆధారాలు ముందు పెట్టినా కూడా సమాధానాలు దాటవేస్తున్నట్టు తెలిసింది. ఆయన ఏమాత్రం సహకరించని నేపథ్యంలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించాలనే ఆలోచనలో సిట్ అధికారులు ఉన్నట్టు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ బాధితుల్లో నేటి సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, ప్రముఖ జర్నలిస్టులు, న్యాయమూర్తులు, పారిశ్రామిక వేత్తలు, పలువురు రాజకీయ నాయకులు, సినీ సెలబ్రిటీలు, చివరకు బీఆర్ఎస్ అధినేత, నాటి సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు



కూడా ఉన్నట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అధికారులు పలువురు బాధితుల వాంగ్మూలాలను నమోదు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో పాత్రధారులైన నాటి పోలీసు అధికారులు రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావు, తిరుపతన్న, భుజంగరావు తదితరులను అరెస్టు చేశారు. కీలక పాత్రధారి అయిన ప్రభాకర్‌రావు మాత్రం న్యాయపరమైన అవకాశాలను వాడుకుంటూ జాప్యం చేశారు. చివరికి సుప్రీంకోర్డు ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారి ముందు ఈనెల 12న లొంగిపోయారు. అయితే ట్యాపింగ్ వ్యవహారం రాజకీయ ప్రేరేపితమనేందుకు ఆధారాలు ఉన్నా.. కోర్టులో నిలబడే విధంగా రుజువు చేయడం సిట్‌కు ఇబ్బందిగా మారింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని మొత్తం పర్యవేక్షించిన ప్రభాకర్‌రావు పెదవి విప్పితేనే ఈ సమస్య తప్పుతుంది. ఆయన మాత్రం దానిని దాటవేస్తుండటంతో.. గత మూడు రోజుల విచారణలో పురోగతి కనిపించడం లేదని తెలిసింది. ఈ క్రమంలో ప్రజల గోప్యతకు, వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించిన కోణంలో, బాధితుల వాంగ్మూలాల ఆధారంగా.. ప్రభాకర్‌రావును అరెస్టు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
15 డిసెంబర్
2025



# యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

**ఉచిత దర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం**

**సండే ఆలయానికి రూ.52.72 లక్షల ఆదాయం**







యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. రద్దీ కారణంగా కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, వ్రత మండపాలు కిక్కిరిశాయి. భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో.. స్వామివారి ఉచిత దర్శనానికి మూడు గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం పట్టింది. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపుసేవతో ముగిశాయి. ఆలయంలో నిర్వహించిన స్వామివారి నిత్యకల్యాణం, సుదర్శన నారసింహ హోమం, సువర్ణపుష్పార్చనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.52,72,699 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.19,54,900 లక్షలు, వీఐపీ దర్శన టికెట్ల ద్వారా రూ.8.70 లక్షలు, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.7.60 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.4,83,600 అదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.




# జనగామలో రెండవ విడత పోలింగ్ ప్రశాంతం

**89 శాతం పోలింగ్ నమోదు**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

జనగామ డిసెంబర్ 14: (రోమింగ్ న్యూస్ ) అజనగామ జిల్లాలో ఆదివారం జరిగిన రెండో విడత పోలింగ్ కూడా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ యజ్వాన్ భాషా షేక్ తెలిపారు. జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రతి ఒక్కరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిందని, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం తెలిపారు.ఉదయం 7.00 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన పోలింగ్ లో దాదాపు 89 శాతం నమోదు అయ్యిందన్నారు. ముందుగా కలెక్టరెట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి ని పరిశీలించారు. అనంతరం పెంబర్తి, శామీర్ పేట్, తమ్మడ్ పల్లి లో పోలింగ్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ రవి కిరణ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి... అక్కడ జరుగుతున్న పోలింగ్ నిర్వహణ ను నిశితం గా పరిశీలించారు. పోలీస్ బందో



బస్తు, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను, పోలింగ్ అధికారుల పని తీరు ను అబ్జర్వర్, కలెక్టర్ దగ్గరుండి పరిశీలించి... ఆర్వో లకు, మైక్రో అబ్జర్వర్ లకు పలు సూచనలు ఇచ్చారు ఈ కార్యక్రమం లో తహసీల్దార్ లు, ఎంపీడీఓ లు, తదితరులు పాల్గొన్నారు

# పదో తరగతి పరీక్షల టైం టేబుల్‌ను సమీక్షించి సవరించాలి

**పాఠశాల డైరక్టర్ కు విజ్ఞప్తి చేసిన బాలల హక్కుల సంక్షేమ సంఘం (బిహెచ్ఎస్ఎస్)**





హైదరాబాద్, రోమింగ్ న్యూస్: 2026 ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్ పై బాలల హక్కుల సంక్షేమ సంఘం అభ్యంతరం వ్యక్తంచేసింది. పదో తరగతి పరీక్షలు నెలరోజుల పరీక్షలు పాటు నిర్వహించడంలో ఎలాంటి హేతుబద్ధత లేదని పరీక్షకు పరీక్షకు గరిష్టంగా 4 రోజుల వ్యవధి ఉందని, సాంఘిక శాస్త్రం పరీక్షకు 5 రోజుల వ్యవధి ఉందనీ ఇది విద్యార్థుల మానసిక స్థాయిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట అధ్యక్షులు డా గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ తెలిపారు. పాఠశాల విద్యా డైరక్టర్ చెప్పినట్లు ఈ విధానం విద్యార్థుల మానసిక వత్తిడి తగ్గించడం అటుంచి విద్యార్థుల విలువైన సమయాన్ని వృధాచేయడమే జరుగుతుందని వారున్నారు. పరీక్షకు పరీక్షకు ఎక్కువ రోజుల వ్యవధి ఉండడం వల్ల విద్యార్థులు బాగా చదువుకొని పరీక్షలు వ్రాయుటకు అవకాశం ఉంటుందని చెప్పడం ఒక "ఆదర్శం" మాత్రమే అని వారున్నారు. ప్రాక్టికల్ గా ఆలోచిస్తే ఇది విద్యార్థులకు విసుగు, నిరుత్సాహం కల్గిస్తుంది. విద్యార్థుల విలువైన సమయాన్ని దుర్వినియోగం చేస్తుంది. విద్యార్థుల్లో ఒకరకంగా తీవ్ర మానసిక ఆందోళన కలిగించనుందని వారు అన్నారు. మార్చి 14 నుండి పరీక్షలు అంటేనే విద్యార్థులు వారం పదిరోజుల ముందునుండే స్కూల్ కు రావడం తగ్గిస్తారు. స్కూల్లో వాళ్లను రప్పించడం ఎత్తయితే వారు తరగతి గదిలో కూర్చోవడము గగనం అవుతుంది. ఈ పరిస్థితుల్లో పాఠ్యాంశాలు రివిజన్ చేయడానికి ఉపాధ్యాయులు నానా యాతన పడాల్సి వస్తుంది. ఇది ప్రాక్టికల్ గా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విషయమే. కాబట్టి ఇప్పటిలాగానే పరీక్షకు పరీక్షకు ఎక్కువ రోజులు వ్యవధి లేకుండా త్వరగా పరీక్షలు ముగిసేలా టైం టేబిల్ ను సవరించాలని ఉపాధ్యాయులు,విద్యార్థులు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మెజారిటీ తల్లిదండ్రులు,విద్యార్థుల, ఉపాధ్యాయుల అభిప్రాయాలు సేకరించడం జరిగిందని వారున్నారు. పరీక్షల మధ్య ఎక్కువ విరామం ఉంటే సమయాన్ని దుర్వినియోగం చేయడానికి అవకాశం ఉండి, విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన పెరుగుతుందన్నారు. కావున నెల రోజుల పాటు నిర్వహించే పరీక్షల షెడ్యూల్ను సమీక్షించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ను బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) విజ్ఞప్తి చేసింది.

# 'కారోబార్' టూ 'సర్పంచ్'

**జంగంపల్లి సర్పంచ్ గా గెలిచిన కృష్ణ గతంలో కారోబార్ గా సేవలు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి జిల్లాలో ఓ గ్రామానికి కారోబార్ గా పనిచేసిన వ్యక్తే ఆ గ్రామానికి సర్పంచ్ గా గెలిచారు. వివరాల్లోకి వెళ్తే.. యాదగిరిగుట్ట మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన పారునంది కృష్ణ డిగ్రీ వరకు చదువుకుని అదే గ్రామానికి కారోబార్ గా పని చేశారు. 2021 జూలై 1 నుండి 2025 జూన్ 30 వరకు.. నాలుగు సంవత్సరాల పాటు గ్రామ కారోబార్ గా విధులు నిర్వర్తించారు. సర్పంచ్ గా పోటీ చేయాలని ముందే నిర్ణయించుకున్న కృష్ణ.. కారోబార్ పదవికి ఈ ఏడాది జూన్ 30న రాజీనామా చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో భాగంగా జంగంపల్లి గ్రామం ఎస్సీ రిజర్వ్ అయింది. రిజర్వేషన్ కూడా కలిసి రావడంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పారునంది కృష్ణ.. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా.. ఈ నెల 11న జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో జంగంపల్లి సర్పంచ్ గా అఖండ మెజారిటీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన సర్పంచ్ అభ్యర్థి సున్నం లక్ష్మయ్యపై 275 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. గ్రామంలో మొత్తం 634 మంది ఓటర్లు ఉండగా 590 ఓట్లు పోల్ అయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి కృష్ణ 429 ఓట్లు సాధించగా.. బీఆర్ఎస్ అభివృద్ధి లక్ష్మయ్యకు 154 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో 275 ఓట్ల మెజారిటీతో కృష్ణ గెలిచినట్లు ఎన్నికల అధికారులు ఫలితాలు వెల్లడించారు. జంగంపల్లి గ్రామంలోనే పుట్టి అదే గ్రామానికి నాలుగేళ్ల పాటు కారోబార్ గా సేవలందించిన పారునంది కృష్ణ.. ఏకంగా సర్పంచ్ గా విజయం సాధించి సరికొత్త అధ్యాయాన్ని లిఖించి చరిత్ర పుటల్లోకి ఎక్కారు.

# ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**షుగర్ మీటర్‌కు బదులుగా సబ్బుబిళ్ల**

ఆన్‌లైన్ కొనుగోళ్లలో జరుగుతున్న మోసాలు అన్నీ ఇన్నీ కావు. చూపేది ఒక వస్తువు, డెలివరీ అయ్యేది మరొక వస్తువు. వివరాల్లోకి వెళితే.., శివనగర్‌కు చెందిన ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో రూ.700 విలువైన షుగర్ (గ్లూకోమీటర్) మిషన్‌ను ఆర్డర్ చేశాడు. కొరియర్ వచ్చినప్పుడు, డెలివరీ బాయ్ తాను ఆర్డర్ చేసిన మిషన్ వచ్చిందని నమ్మబలకడంతో, ఆ వ్యక్తి డబ్బు చెల్లించి పార్శిల్‌ను తీసుకున్నాడు. అయితే, కొరియర్ బాయ్ వెళ్లిపోయిన అనంతరం బాక్స్‌ను తెరిచి చూడగా, అందులో గ్లూకోమీటర్ మిషన్‌కు బదులుగా సబ్బుబిళ్ల ఉండటం చూసి తాను మోసపోయానని గ్రహించాడు. వెంటనే ఆ బాక్స్‌పై ఉన్న ఫోన్ నంబర్‌కు గత రెండు రోజులుగా ఫోన్ చేస్తున్నప్పటికీ, ఆ నంబర్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఆన్‌లైన్ మోసగాళ్లు ఏదైనా వస్తువును ఆర్డర్ చేస్తే, దానికి బదులుగా బిస్కెట్ ప్యాకెట్లు, సబ్బులు లేదా అగ్గిపెట్టెల వంటి వాటిని సరఫరా చేస్తున్నారు. కావున, ఆన్‌లైన్లో వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు ప్రజలందరూ తస్మాత్ జాగ్రత్త వహించి, మోసపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరడమైనది.

ప్రతి అక్షరం ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
15 డిసెంబర్
2025




# రేషన్, ఆధార్ సహాఆస్తులనూ లాక్కుంటారు

## 'ఓట్ చోరీ' కాంగ్రెస్ సమస్య కాదు.. దేశ సమస్య: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**న్యూఢిల్లీ, డిసెంబరు 14 :** సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో దేశంలోని దళితులు, మైనార్టీలు, ఆదివాసీలు, పేదల ఓట్లను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఓట్ల తొలగింపుతో ఎస్ఐఆర్ ఆగదని.. ఆ తర్వాత ఈ వర్గాల ఆధార్, రేషన్, భూములు, ఆస్తులనూ లాక్కుంటారని అన్నారు. 'ఓట్ చోరీ' (ఓట్ల తస్కరణ) కాంగ్రెస్ పార్టీ సమస్య కాదని, యావత్ భారతదేశ సమస్య అని పేర్కొన్నారు. ఓట్ చోరీపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సాగిస్తున్న పోరాటంలో దేశ ప్రజలంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓట్ చోర్ – గద్దీ ఛోడ్' పేరుతో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. 'దేశ ప్రజల రాజ్యాంగ హక్కుల కోసం రాహుల్‌గాంధీ యుద్ధం చేస్తున్నారు. దీనికి ప్రజలంతా మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉంది. లేదంటే.. ఇది ఓట్ చోరీతోనే ఆగేది కాదు. ముందు ఓటర్ లిస్టు నుంచి పేరును తొలగిస్తారు. ఆ తర్వాత ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, భూమి, ఆస్తులను సైతం లాక్కుంటారు. రాజ్యాంగసభలో విస్తృతంగా చర్చించి రాజ్యాంగాన్ని రూపొందించారు. నాడు దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, నిరుపేదలకు ఓటు హక్కు కల్పించాలని మహాత్మా గాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కోరారు. పేదలకు ఓటు హక్కు ఇచ్చి ప్రభుత్వ ఏర్పాటులో వారికి అవకాశం కల్పించారు. కానీ.. ఆర్ఎస్ఎస్ ఈ వర్గాలకు ఓటు హక్కును నిరాకరించింది. ఆర్ఎస్ఎస్ నేత గోల్వాల్కర్.. దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలకు ఓటు హక్కు ఇవ్వరాదని వాదించారు. ఆయన ఆలోచనా విధానాన్ని ఇప్పుడు అమలు చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారు. అందుకోసమేగత లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని ప్రజలను అడిగారు. బీజేపీకి 400 సీట్లు వేస్త రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేన్లను రద్దు చేస్తారని రాహుల్‌గాంధీ నాడే చెప్పారు. అందుకే ప్రజలు



బీజేపీకి 240 సీట్లతో సరిపెట్టారు. కాబట్టే రాజ్యాంగం రక్షించబడింది. ఒకవేళ వారికి 400 సీట్లు వచ్చి ఉంటే బహిరంగంగానే రాజ్యాంగాన్ని తొలగించేవారు. అన్ని సీట్లు రాలేదు కాబట్టే వారు ఎస్ఐఆర్, ఓట్ చోరీ ద్వారా దళిత, ఆదివాసీ, మైనార్టీ, నిరుపేదల ఓట్లు తొలగించే పనిలో పడ్డారు. గతంలో ఈ వర్గాల కోసం మహాత్మాగాంధీ, అంబేద్కర్ పోరాడగా.. ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిలబడ్డారు. ఓట్ చోరీ అనేది కాంగ్రెస్ సమస్య కాదు. దేశ సమస్య. ఈ యుద్ధంలో మనమంతా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలవాలి' అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## దావోస్‌కు సీఎం రేవంత్

**జనవరి 19 నుంచి 23 వరకు సదస్సు**

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ నేతలు, పారిశ్రామిక దిగ్గజాలు కలుసుకునే చోటు.. వరల్డ్ ఎకనామిక్ ఫోరం స్విట్జర్లాండ్‌లోని దావోసలో ఏటా నిర్వహించే సదస్సు! ఈసారి 'స్పిరిట్ ఆఫ్ డైలాగ్' థీమ్‌తో జనవరి 19 నుంచి 23 వరకూ జరగనున్న ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 130 దేశాల నుంచి 3 వేల మంది నాయకులు.. సుమారు 60 మంది దేశాధినేతలు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ముఖ్యంగా..ఈసారి భారత్ నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రాతినిధ్యం ఉండనుంది. దేశంనుంచి నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వంద మందికిపైగా సంస్థల సీఈవోలు హాజరుకానున్నట్టు సమాచారం. 2024, 2025లో దావోస్ సదస్సుకు వెళ్లిన తెలంగాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఈసారి కూడా ఆ సదస్సుకు హాజరుకానున్నట్లు సమాచారం. ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తోపాటు పలువురు కేంద్ర మంత్రులు కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇక.. భారత్ నుంచి హాజరుకానున్న వ్యాపారవేత్తల్లో.. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, బజాజ్ గ్రూప్‌కు చెందిన సంజీవ్ బజాజ్, భారతి గ్రూప్ అధినేత సునీల్ భారతి మిట్టల్‌తోపాటు , ఇన్ఫోసిస్, విప్రో, యాక్సిస్ బ్యాంక్, పేటీఎం, జెరోధా సంస్థల ప్రతినిధులు, పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల ముఖ్య అధికారులు ఉన్నారు. ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, ఐఎంఎఫ్ అధినేత క్రిస్టలినా జార్జీవా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ వంటి ప్రముఖులు కూడా ఈ వేదికపై కనిపించనున్నారు. ప్రభుత్వాలు–ప్రైవేటు రంగం కలిసి భవిష్యత్తును నిర్మించాల్సిన అవసరంపై సదస్సులో చర్చ జరగనుందని సమాచారం.

# ప్రజాస్వామ్యంలో హత్య రాజకీయాలు పెద్ద ప్రమాదం

**కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో హత్య కావించబడిన మల్లయ్య కుటుంబా న్ని పరామర్శించిన కేటీఆర్**

**మృతుడు ఉప్పుల మల్లయ్య కు టుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సా యం**

**పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రశాం త వాతావరణంలో తుంగతుర్తి**

**భవిష్యత్ కు కెసిఆర్ పాలనే తె లంగాణకు శ్రీరామరక్ష**



**తుంగతుర్తి:** ప్రజా స్వా మ్యంలో హత్య రాజకీయాలు ఎం త మాత్రం మంచిది కాదని బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరి సి ల్లా ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఆ దివారం ఇటీవల సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నూతన కల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య కాంగ్రెస్ కార్య క ర్తల దాడిలో హత్య కావించబడిన ఉప్పుల మల్లయ్య కుటుంబాన్ని ప రామర్శించి మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పిన అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడు తూ గెలుపు కోసం తమ పార్టీ నా యకుడు మల్లయ్యను హత్య చే యడం హేయమైన చర్యని దీన్ని తీ వ్రంగా ఖండిస్తున్నా మని కేటీఆర్ అ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను అమలు చేసినట్లయితే ఓట్ల కోసం ఇలా హత్యలు చేయాల్సి వచ్చేదా అని ప్రశ్నిం చారు. సర్పంచ్ ఎన్ని క లకు భయపడి దాడులు చేయడం ఏమిటి అని అన్నారు. దాడులతో ప్రజాస్వామ్యాన్ని అప హాస్యం పా లు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం త గి న మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. కెసిఆర్ పాలనే తెలంగాణకు శ్రీరా మరక్ష అని కేటీఆర్ అన్నారు. తా ము పది సంవత్సరాలు అధికారం లో ఉన్న నాడు తాము దాడులకు పాల్పడలేదని ఇలాంటి హత్య రాజకీయాలు చేయలేదని ఒకవేళ చేసి ఉంటే ఈ రోజు పరిస్థితులు ఇలా ఉండేవా అని ప్రశ్నించారు. బిఆర్ ఎస్ పార్టీ ప్రజ ల్లో బలంగా ఉండ డంతో తాము ఎక్కడ ఓడిపోతా మని భయంతో గ్రామాల్లో బయో త్పాతం సృష్టిస్తూ హత్యలు దా డు లకు పాల్పడుతున్నారని ఇది ప్ర జా స్వామ్యానికి మంచిది కాదని కేటీ ఆర్ హితవు పలికారు. ఎల్లమ్మ గూడెం గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థులు కిడ్నాప్ చేసి మూత్రం తగించారని దౌర్జన్యానికి కాంగ్రెస్ వారు పాల్పడ్డారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు రానున్న రో జుల్లో ప్రజలు మరింత చైతన్య వం తం అవుతారని అభివృద్ధి నిరోధ కు లైన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చె ప్తారని అన్నారు. మల్లయ్య కుటుం బానికి తమ ప్రభుత్వం వచ్చిన అ నంతరం కుటుంబంలో ఒకరికి ప్రభు త్వ ఉ ద్యోగం ఇస్తామని వారి కు టుంబాన్ని అన్ని విధాల తాము ఆ దుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ప్రజలు అధైర్యపడవద్దని అన్నారు. నాయకులు కార్యకర్తలు సంయ మనం పాటిం చాలని హింస మార్గంతో ఏది సా ధించలే మని దాడులకు ప్రతి దా డు లు సరికాదని కాంగ్రెస్ పార్టీ దాడు లు మానుకోకపోతే ప్రతిదాడులు చే యాల్సి వస్తుందని తాము సమ యమున కోల్పోతే కాంగ్రెస్ పార్టీ వా రు మిగలరని తమ సహనాన్ని పరీ క్షించవద్దని తస్మాత్ జాగ్రత్త కాంగ్రెస్ నాయకుల నుద్దేశించి అన్నారు. ఎన్ని ఎత్తులు, కుట్రలు పన్నిన 50 శాతం సర్పంచ్ బి ఆర్ ఎస్ పార్టీ గెలుచుకుందని కేటీఆర్ అన్నారు. అందుకే కాంగ్రెస్ నాయకులు మ రో సారి ఆలోచించి శాంతియుత వా తావరణంలో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వెంట మా జీ మంత్రి, సూర్యాపేట శాసనస భ్యులు గుంత కండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బూ డి ద బిక్షమయ్యగౌడ్, కంచర్ల భూపా ల్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్ మాజీ ఎంపీ బడుగు లింగయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్ రావు, ఒంటెద్దు నరసిం హారెడ్డి లతో పాటు పలువురు బి ఆ ర్ ఎస్ నాయకులు పెద్ద ఎత్తున కా ర్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలో పునర్వ్యవస్థీకరణ

**మంత్రివర్గం నుంచి పొన్నం, సురేఖను తప్పిస్తారనే వార్తల్లో వాస్తవం లేదు**

**నెల రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిటీలు**

**బీఆర్ఎస్ ముగిసిన కథ..**

**కవితతో ఆ పార్టీకి కొలుకోలేని దెబ్బ**

**ఢిల్లీలో మీడియాతో మహేశ్ గౌడ్ ఇష్టాగోష్ఠి**

**న్యూఢిల్లీ, డిసెంబరు 14 :** త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, సురేఖలను తొలగిస్తారంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఆ ఇద్దరూ బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులని, పార్టీ కోసం కష్టపడినవాళు అని కితాబిచ్చారు. అయితే శాఖలు మారుస్తారా? మంత్రివర్గంలో మార్పులుంటాయా? అన్న విషయాల్లో తనకు స్పష్టతలేదన్నారు. తాను క్యాబినెట్‌లోకి వెళతాననే విషయంలో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తనను మంత్రివర్గంలోకి ఆహ్వానించారని, స్వయంగా కేసీ వేణుగోపాల్ తనతో మాట్లాడారని, తనకు ఆసక్తిలేదని చెప్పానని వివరించారు. పార్టీ కోసం పనిచేయడంలోనే తనకు సంతృప్తి ఉ ందన్నారు. నెలరోజుల్లోనే వర్కింగ్ ప్రెసిడెంట్లు, కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిటీల నియామకం ఉ ంటుందని వెల్లడించారు. తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం చివరిదశకు చేరింద న్నారు. ఆదివారంఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఉప్పల్‌లో మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, ప్రపంచదేశాల దృష్టి తెలంగాణ మీద పడుతుందనే ఉ ద్దేశంతోనే ఈవెంట్‌కు ప్రభుత్వం సహకరించిందని తెలిపారు. నెహ్రూపై పార్లమెంట్‌లో మోదీ వ్యాఖ్యలు సరికాదన్నారు. ప్రియాంక గాంధీ అద్భుతంగా మాట్లాడారని కితాబిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలు సమర్థులను పక్కనబెట్టి వేరేవాళ్లకు అవకాశం కల్పించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ కారణంగా అభ్యర్థుల ఓట్లు చీలడంతో మూడో స్థానానికి పరిమితం కావాల్సిన బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారన్నారు. సీఎం రేవంత్ విజనరీ లీడర్ అని, ప్రపంచ స్థాయిలో ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. అంచనాలకు మించి గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రాజకీయ ప్రాధాన్యం ఉండొద్దనే మంత్రులన్ను స్టజీ మీదకు ఆహ్వానించలేదన్నారు. తెలంగాణలో మళ్లీ అధికారం కాంగ్రెసదేనని, బీఆర్ఎస్ కథ ముగిసిందని, కవిత దెబ్బతో ఆ పార్టీ కొలుకునే పరిస్థితుల్లో లేదన్నారు. హరీశ్, సమయం కోసం వేచి చూస్తున్నారని, వెన్నుపోటు ఖాయమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో బీజేపీ లేదని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీ డిపాజిట్ గల్లంతైందన్నారు. ఆ పార్టీకి 70–80 నియోజకవర్గాల్లో క్యాడరేలేదన్నారు.

# ఉప్పుడు బియ్యం అదనపు కోటా ఇవ్వండి

**రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని పెంచండి**

**కేంద్రానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ**



**హైదరాబాద్, డిసెంబరు 14 :** రబీ సీజన్ 2024–25కు సంబంధించి ఉ ప్పుడు బియ్యం అదనపు కోటా మంజూరు చేయాలని మంత్రి ఉ త్తమ్‌కుమార్‌రెడ్డి.. కేంద్రాన్ని కోరారు. సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద ఎఫ్‌సీఐ ఇప్పటి వరకు 17.83లక్షల టన్నుల ఉప్పుడు బియ్యాన్ని సేకరించిందని.. మరో 10లక్షల టన్నులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2025–26 ఖరీఫ్ సీజన్‌కు కేంద్రం 36 లక్షల టన్నుల బియ్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించిందని, ఈ మొత్తాన్ని 54 లక్షల టన్నులకు పెంచాలని కోరారు. సీఎంఆర్ గడువును జనవరి 31 వరకు పెంచాలని కోరారు. ఈ మేరకు ఉ త్తమ్.. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాశారు. తెలంగాణలో మరో 15లక్షల టన్నుల గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. 2014–15 ఖరీఫ్‌లో సేకరించిన బియ్యానికి సంబంధించి రూ. 1,468కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

# ప్రజల జీవితాలతో కాంగ్రెస్ రాజకీయ ఫుట్‌బాల్

**ఇది రాహుల్‌కు కనిపించడం లేదు: బండి సంజయ్**



**హైదరాబాద్, డిసెంబరు 14 :** రాష్ట్ర ప్రజల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న రాజకీయ ఫుట్‌బాల్.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కనిపించడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. తెలంగాణ ప్రజల ఇబ్బందుల కంటే మెస్సీయే రాహుల్‌కు ప్రాధాన్యమయ్యారని విమర్శించారు. హైదరాబాద్‌లో మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు రాహుల్ హాజరుకావడంపై 'ఎక్స్' వేదికగా సంజయ్ స్పందించారు. "మీరు ఫుట్‌బాల్ మ్యాచ్ చూడటానికి వచ్చారు.. కానీ మీ ప్రభుత్వం రాష్ట్రంలో పేదల ఇళ్లు కూల్చివేస్తోంది. కలుషిత ఆహారంతో విద్యార్థులుచని పోతున్నారు. దారుణ హత్యలు జరుగుతున్నాయి. దేవాలయాలను కూల్చివేస్తున్నారు. తెలంగాణ ప్రజలు ఇబ్బందుల్లో ఉ ంటే నిమిషంలో ఇక్కడ ఉంటానని ఎన్నికల ముందు చెప్పారు. కానీ, ప్రజలు కష్టాల్లో ఉ న్నప్పుడు మీరు గైర్హాజరవుతారు. అల్లర్లు జరిగినప్పుడు విహారయాత్రలో ఉంటారు" అని విమర్శించారు.

# వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే దుష్ప్రచారం

**అసలు రాహుల్ నాయకుడెలా అవుతారు?: కిషన్‌రెడ్డి**



**న్యూఢిల్లీ, డిసెంబరు 14 :** రాహుల్ గాంధీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఓట్ చోరీ దుష్ప్రచారానికి తెర తీశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. దాదాపు 100 ఎన్నికల వైఫల్యాల తర్వాత కూడా రాహుల్ నాయకుడెలా అవుతారని ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన ప్రశ్నించారు. ప్రజలు కాంగ్రెస్ ఆరోపణలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 'ఓట్ చోరీ పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. పార్లమెంట్‌లో కాంగ్రెస్ ప్రశ్నలకు బీజేపీ సూటిగా సమాధానం చెప్తుంటే ఆ పార్టీ భయపడి పారిపోయింది. రాహుల్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఓట్ చోరీ దుష్ప్రచారానికి తెరతీశారు. ఆ విషయం ప్రజలకు కూడా అర్థమైంది. దాదాపు 100 ఎన్నికల వైఫల్యాల తర్వాత కూడా రాహుల్ నాయకుడెలా అవుతారు..? కాంగ్రెస్ శ్రేణులు ఇవన్నీ ఆలోచించకుండా బిజీగా ఉంచేందుకు, నాయకుడిగా తన వైఫల్యాలను ప్రశ్నించే వారు లేకుండా చేసుకోవడానికే రాహుల్ అసత్య ఆరోపణలు, ఆందోళనలు చేస్తున్నారు. రామ్‌లీలా మైదానంలో మాట్లాడిన ఒక్కో నేత రామాయణంలో విలన్‌కు ఉ న్న ఒక్కో తలను తలపించేలా ప్రవర్తించారు' అని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
15 డిసెంబర్
2025





# బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్!

పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆమోదం

45 ఏళ్ల వయస్సులో సరికొత్త రికార్డు

పిన్న వయస్కుడైన ప్రెసిడెంట్గా పేరు

ప్రస్తుతం బీహార్ మంత్రిగా నితిన్

ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక

బీజేపీలో అనేక కీలకమైన బాధ్యతలు

కొత్త ప్రెసిడెంట్కు మోడీ, అమిత్ షా, నడ్డా, నితీశ్ అభినందనలు



**న్యూఢిల్లీ :** బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిహార్ మంత్రి నితిన్ నబీన్(45)ని ప్రకటించారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆయన్ను నియమించినట్లు బీజేపీ జాతీయ జనరల్ సెక్రటరీ అరుణ్ సింగ్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నితిన్ నబీన్ బిహార్ ప్రభుత్వంలో ప్రజాపనులశాఖ మంత్రిగా ఉన్నారు. రానున్న కాలంలో ఈయన ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్థానాన్ని భర్తీ చేస్తారని బీజేపీ నేతలు తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నబీన్ఇప్పటికే బిహార్ రాష్ట్ర ప్రభుత్వంలో రెండుసార్లు మంత్రిగా వ్యవహరించారు. ప్రస్తుతం పట్నాలోని బంకిపూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన యువ నేతల్లో ఈయన ఒకరు. కాగా ఈయన నియామకం పలువురిని ఆశ్చర్యపరిచింది. అయితే పరిపాలన అనుభవం, పార్టీకి అంకిత భావంతో చేసి న సేవలు ఆయనకు ఈ పదవిని తెచ్చి పెట్టాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. బీజేవైఎం నేతగా సుదీర్ఘ అనుభవం, బూత్ స్థాయిలో పనిచేసి న అనుభవం, కార్యకర్తలను నడిపించే నైపుణ్యం ఆయనకు కలిసి వచ్చా యి. 2023లో జరిగిన ఛత్తీసగఢ్ అసెంబ్లీ ఎన్నికలు ఆయన నాయకత్వ పటిమను మరింత వెలుగులోకి తెచ్చాయి. ఆ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా.. అందుకు భిన్నంగా ఘనవిజయం సాధించింది. అప్పుడు ఛత్తీసగఢ్ బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్న నితిన్ నబీన్ తన వ్యూహరచనతో పార్టీని ప్రజలకు చేరువ చేయడంతోపాటు నేతలను ఏకతాటిపై నడిపించి పార్టీకి ఘన విజయాన్ని సాధించి పెట్టారు. దీంతో ఎన్నికల వ్యూహకర్తగా పార్టీలో ఆయన పేరు గడించారు. ప్రధాని మోదీ ఆయన్ను అభినందిస్తూ.. నబీన్ అంకిత భావం, సమర్థత రానున్న కాలంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తుందని ఆకాంక్షించారు.

**బీజేపీ యూపీ అధ్యక్షుడిగా పంకజ్ చౌధరి**

బీజేపీ ఉత్తర్‌ప్రదేశ్ యూనిట్ నూతన అధ్యక్షుడిగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఎన్నికయ్యారు. ఈమేరకు లఖ్‌నవూలో ఆదివారం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేష్ పాఠక్ సమక్షంలో పంకజ్ చౌధరి ఎన్నికైనట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. అధ్యక్ష పదవికి పంకజ్ ఒక్కరే నామినేషన్ వేశారు. కాగా బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన నితిన్ నబీన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. కాగా, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ యూపీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆదివారం లఖ్‌నవూలో జరిగిన సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాలో మారణకాండ

సిడ్నీ బోండిబీచ్‌లో 'హనూకా' వేడుకలపై ఇద్దరు సాయుధుల కాల్పులు

29 మందికి గాయాలు.. ఒక ఉగ్రవాదిపైకి లంఘించి తుపాకీ లాక్కున్న పౌరుడు

పోలీసుల కాల్పులు.. ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకరి మృతి, మరొకరి అరెస్ట్

అతడు సిడ్నీ వాసి నవీద్.. ఉగ్రవాదిని ఒడిసిపట్టిన వ్యక్తి పండ్ల వ్యాపారి అహ్మద్?

ఆస్ట్రేలియా విధానాలతోనే యూదు ద్వేషానికి ఆజ్యం: నెతన్యాహూ.. మోదీ దిగ్భ్రాంతి



**సిడ్నీ:** అది ఆస్ట్రేలియా సిడ్నీ నగరంలోని ప్రఖ్యాత బోండి బీచ్.. ఓ పక్కన యూదుల మత కార్యక్రమం 'హనూకా' వేడుకలు జరుగుతున్నాయి.. వందలాది మంది గుమిగూడి ఉన్నారు.. ఉన్నట్టుండి నలుపు రంగు దుస్తుల్లో ఉన్న ఇద్దరు సాయుధులు అక్కడికి దూసుకొచ్చారు. కార్యక్రమం జరుగుతున్న ప్రాంతానికి సమీపంలోని పాదచారుల వంతెనపైకి ఎక్కి జనం వైపు కాల్పులు మొదలుపెట్టారు. యూదు ల్లో ఒక్కసారిగా హాహాకారాలు చెలరేగాయి. ఎటువైపువారు అటు చెల్లాచెదురయ్యారు. పదుల సంఖ్యలో రక్తపు మడుగులో పడిపోయారు. మరికొందరు ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగులు తీశారు. ఉగ్రవాదులు వారిని వెంటాడుతూ కాల్పులు జరిపారు. సుమారు ఏడు నిమిషాలపాటు మారణహోమం జరిగింది. ఈ క్రమంలో ఒక యువకుడు ధైర్యంగా ఓ ఉగ్రవాదితో కలబడి తుపాకీ లాక్కున్నారు. కాసేపట్లోనే పోలీసులు అక్కడికి చేరుకుని కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 12 మంది యూదులు మరణించగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు కాల్పుల్లో ఒక ఉగ్రవాది మరణించాడు. మరొకరిని ప్రాణాలతో పట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. బోండి బీచ్ ఘటన నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ వెంటనే జాతీయ భద్రతా సమావేశాన్ని నిర్వహించి, పరిస్థితిని సమీక్షించారు. ఉగ్రవాద దాడి చాలా దారుణమని.. దీనిపై లోతుగా దర్యాప్తు జరిపి, చర్యలు చేపట్టాల్సిందిగా పోలీసులు, అధికారులను ఆదేశించారు. కాగా, ప్రధాని ఆల్బనీస్ బోండి బీచ్ ఘటన యూదులపై జరిగిన దాడి అనే ప్రస్తావన తీసుకురాకపోవడంపై ఆస్ట్రేలియా యూదు అసోసియేషన్ తీవ్రంగా మండిపడింది. ఇది ఆయన సిగ్గుపడాల్సిన విషయమని వ్యాఖ్యానించింది. ఆస్ట్రేలియాలో యూదు ద్వేషంపై చాలా సార్లు ప్రభుత్వానికి హెచ్చరికలు వచ్చాయని, అయినా యూదులను రక్షించేందుకు తగిన చర్యలు చేపట్టలేదని పేర్కొంది. మరోవైపు ఆస్ట్రేలియాలోని ముస్లిం సంస్థలు ఈ ఉగ్రవాద దాడిని ఖండించాయి. ఇది చాలా దారుణమైన ఘటన అని.. ఆస్ట్రేలియాలోని ముస్లిం సమాజం సహా అందరిపై దాడి జరిగినట్లేనని ఆస్ట్రేలియా నేషనల్ ఇమామ్స్ కౌన్సిల్ ప్రకటించింది. బాధిత కుటుంబాలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్టు పేర్కొంది.

**ఒక ఉగ్రవాది.. పాకిస్థానీ అని ప్రచారం!**

హనుక్కా వేడుకపై జరిగినది ఉగ్రదాడేనని న్యూసౌత్‌వేల్స్ పోలీస్ కమిషనర్ మాల్ లన్యన్ ప్రకటించారు. దాడి ఘటన అనంతరం తనిఖీల్లో ఉగ్రవాదులకు చెం దిన కారులో ఒక బాంబు, పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పోలీసుల కాల్పుల్లో ఒక ఉగ్రవాది మరణించగా, తీవ్రంగా గాయపడిన మరో ఉగ్రవాది పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఉగ్రవాదుల్లో ఒకరి ని సిడ్నీలోని బోనీరిగ్ ప్రాంతంలో ఉండే 24ఏళ్ల నవీద్ అక్రమ్‌గా గుర్తించినట్టు ఒక సీనియర్ అధికారి తెలిపారు. కాగా అతను పాకిస్థాన్‌లోని లాహోర్‌కు చెందినవాడని, సిడ్నీలోని అల్ మురాద్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్నాడని అతడి పేరిట ఉన్న డ్రైవింగ్ లైసెన్సు, ఇతర ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్నాయి. అధికారికంగా ధ్రువీకరణ కాలేదు. ఈ ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌లో హమాస్ దాడిలో తృటిలో తప్పించుకున్న ఓ వ్యక్తి.. 2 వారాల క్రితమే ఆస్ట్రేలియా వచ్చి ఇప్పుడు బోండి బీచ్ ఉగ్రదాడిలో తీవ్రంగా గాయపడ్డారు.

**దాడిని ఖండించిన ఇజ్రాయెల్**

సిడ్నీలో హనుక్కా వేడుకపై దాడిని యూదు దేశమైన ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఆస్ట్రేలియా ప్రభుత్వ విధానాలు దీనికి కారణమని ఆరోపించింది. యూదులపై ద్వేషభావం ఆస్ట్రేలియా సమాజాన్ని కలుషితం చేస్తోందని.. ఆస్ట్రేలియాప్రభుత్వ విధానాలు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మండిపడ్డారు. 3నెలల కింద పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్టుగా ఆస్ట్రేలియా ప్రకటించిన సమయంలోనే ఆ దేశ ప్రధాని ఆల్బనీసకు లేఖ రాసినట్టు గుర్తు చేశారు. నేతలు సరిగా స్పందించకున్నా, మౌనంగా ఉన్నా యూదులపై ద్వేషం ఒక క్యాన్సర్‌లా విస్తరిస్తుందన్నారు. ఆస్ట్రేలియాలోని యూదులపై ఉగ్రవాదులు అత్యంత నీచంగా, క్రూ రంగా దాడికి పాల్పడ్డారని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐసాక్ హెర్జోగ్ అన్నారు.

**చీకటిపై వెలుగు సాధించిన విజయమే'హనూకా'**

భారతీయులకు దీపావళి పండుగ తరహాలో యూదులు 'హనూకా' వేడుకను జరుపుకొంటారు. యూదులు క్రీస్తుపూర్వం 141 సంవత్సరంలో తాము ఎంతో పవిత్రంగా భావించే జెరుసలేం ఆలయాన్ని సెల్యూసిడ్ సామ్రాజ్యం నుంచి తిరిగి దక్కించుకున్నారు. అన్ని రోజులుగా చీకటిలో వదిలేసిన పవిత్ర ఆలయంలో దీపం వెలిగించారు. కానీ ఒక్క రోజుకు సరిపడా మాత్రమే నూనె ఉండటంతో ఆందోళన చెందారు. అయితే వారికి తిరుగుబాటు దళాల నుంచి సాయం అందేదాకా 8 రోజుల పాటు ఆ దీపం వెలుగుతూనే ఉంది. అది దైవ మహిమ అని.. చీకటిపై వెలుగు సాధించిన విజయమని తలచి ఏటా చలికాలంలో 8 రోజుల పాటు 'హనూకా' పండుగగా జరుపుకొంటారు. ఈ పండుగలో భాగంగా ఆదివారం తొలి రోజున బోండి బీచ్‌లో క్యాండిల్స్ వెలిగించేందుకు సిద్ధమైన యూదులపై ఉగ్రవాదులు దాడి చేశారు.

**ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు: ప్రధాని మోదీ**

ఆస్ట్రేలియాలో ఉగ్రదాడిపై ప్రధాని మోదీ దిగ్భ్రాం తి వ్యక్తం చేశారు. ఉగ్రదాడి దారుణమని, బాధితులకు భారత ప్రజల తరఫున ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నానని 'ఎక్స్'లో తెలిపారు. ఉగ్రవాదాన్ని భారత్ ఏమాత్రం సహించే ప్రసక్తేలేదన్నారు. ఉగ్రవాదంపై పోరాటానికి భారత్ అన్ని రకాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు.

**మెరుపులా వచ్చి.. తుపాకీ లాక్కుని..**

బోండి బీచ్ ఘటనలో అహ్మద్ అల్ అహ్మద్ అనే వ్యక్తి చూపిన తెగువ ప్రశంసలు పొందుతోంది. కార్లు పార్క్ చేసిన ప్రాంతంలో నిలబడిన అహ్మద్.. ఒక ఉగ్రవాది కాల్పులు జరుపుతూ అటువైపు రావడంతో ఓ కారు వెనక నక్కారు. అత ను తిరిగిన వెంటనే మెరుపులా దూసుకెళ్లి వెనుక నుంచి గట్టిగా పట్టుకున్నారు. ఉగ్రవాది నుంచి తుపాకీని లాక్కుని అతడిపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారు. అంతలోనే మరో వ్యక్తి అహ్మద్‌కు సాయంగా వచ్చారు. కానీ దూరంగా ఉన్న మరో ఉగ్రవాది కాల్పులు జరపడంతో అహ్మద్, మరో వ్యక్తి పక్కనున్న చెట్టు వెనుక దాక్కున్నారు. అహ్మద్ తుపాకీ లాక్కుని ఉండకపోతే మరెందరో కాల్పులకు బలయ్యేవారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఓ వ్యక్తి వీడియో తీస్తుండగా.. సాహసం అందులో రికార్డయింది. 43ఏళ్ల అహ్మద్ బీచ్ ప్రాంతంలోనే పండ్ల వ్యాపారం చేస్తుంటారని మీడియాలో వార్తలు వచ్చాయి.

# సత్యానికి అసత్యానికి మధ్య పోరాటం

బీజేపీ డీఎన్ఏలోనే ఓట్ చోరీ.. కాంగ్రెస్‌లో సత్యం, అహింస

ఆ రెండింటి ద్వారానే పోరాడి.. మోదీని ఓడించి.. గద్దె దించుతాం

కేంద్ర ఎన్నికల సంఘం బహిరంగంగా బీజేపీ కోసం పనిచేస్తోంది

ఓట్‌చోరీలో దొరికిపోయామని మోదీ, షాలకు అర్థమైంది

సభలో నా ప్రశ్నకు జవాబిస్తున్నప్పుడు షా చేతులు వణికాయి

సత్యం గెలవడానికి సమయం పట్టొచ్చు.. కానీ తుది గెలుపు మాదే

'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేసే కుట్ర: మల్లికార్జున ఖర్గే

దమ్ముంటే బ్యాలెట్ విధానంలో పోటీ చేసి గెలవండి: ప్రియాంక



**న్యూఢిల్లీ :** దేశంలో సత్యానికి, అసత్యానికి మధ్య పోరాటం నడుస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గంలో పోరాడడం ద్వారానే.. నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు. బీజేపీ డీఎన్ఏలోనే ఓట్ చోరీ ఉందని, కాంగ్రెస్ డీఎన్ఏలో సత్యం, అహింస ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం బహిరంగంగానే బీజేపీ కోసం పనిచేస్తోందని మండిపడ్డారు. ఆదివారం న్యూఢిల్లీ రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓట్ చోర్- గద్దీ ఛోడ్' మెగా ర్యాలీ జరిగింది. ఈ ఆందోళనలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కేసీ వేణుగోపాల్, అభిషేక్ మను సింఘ్వీ, జైరాం రమేశ్, చిదంబరం సహా సీడబ్ల్యూసీ సభ్యులు, ఏఐసీసీ కీలక నేతలు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మెగా ర్యాలీకి ముందు కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో కలిసి రాహుల్ గాంధీ విందు చేశారు. అక్కడి నుంచి నేరుగా ర్యాలీకి చేరుకున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలతోపాటు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఇతర ముఖ్య నేతలు కూడా ఈ ర్యాలీకి హాజరయ్యారు. సభలో ప్రసంగించిన రాహుల్‌గాంధీ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పేర్లు ప్రస్తావించి మరీ.. వారు బీజేపీ కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. తాము పనిచేసేది దేశం కోసమని, మోదీ కోసం కాదని సత్యాన్ని ఇకనైనా వారు గ్రహించాలని అన్నారు. బిహార్ ఎన్నికల సమయంలో ఓటర్లకు రూ.10వేల చొప్పున బీజేపీ బదిలీ చేసినా.. ఈసీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు. "సత్యానికి అసత్యానికి మధ్య జరుగుతున్న పోరులో.. కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీతో కలిసి పనిచేస్తోంది. కేంద్రం చెప్పినట్లే చేస్తోంది. మేము.. నిస్సందేహంగా సత్యం వైపు నిలబడ్డాం. నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపేస్తాం. వారు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఓట్ చోరీకి పాల్పడుతున్నారు. కానీ.. మాకు ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై నమ్మకం ఉంది.

ఈ పోరాటంలో విజయం సాధించడానికి, సత్యం గెలవడానికి సమ యం పట్టొచ్చు. కానీ.. అంతిమ విజయం సత్యానిదే. సత్యం, అహింస మార్గంలోనే మేం పనిచేస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సభ్యులపై ఎటువంటి చర్యలూ తీసుకోకుండా కేంద్రం ఓ చట్టా న్ని తీసుకొచ్చిందని.. కానీ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని మారు స్తామన్నారు.

**దొరికిపోయామనిగ్రహించారు..**

'ఓట్ చోరీ' విషయంలో తాము దొరికిపోయినట్టు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాతో సహా బీజేపీ నాయకులు గ్రహించారని రాహుల్ గాంధీ తెలిపారు. అందుకే మోదీతోపాటు ఆ పార్టీ నాయకుల్లో ఆత్మవిశ్వాసం సడలిందన్నారు. లోక్‌సభలో 'ఓట్ చోరీ'పై చర్చ సందర్భంగా తన ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నప్పుడు అమిత్ షా చేతులు అందుకే వణికాయన్నారు. బీజేపీ నాయకుల ఆత్మవిశ్వాసం, ధైర్యం కేవలం అధికారం నుంచే వస్తాయని, ఓట్ చోరీతో వాళ్లు ఆ అధికారం దక్కించుకున్నారని మండిపడ్డారు. "మోదీ, షా... మీరు ఎన్ని ప్రసంగాలు చేసినా, అంతిమంగా సత్యానిదే విజయం... మేం మిమ్మల్ని సత్యం, అహింసతో ఓడిస్తాం," అని రాహుల్ హెచ్చరించారు. కాగా.. దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు బీజేపీ, ఆర్ఎసఎస్ కుట్ర పన్నుతున్నాయని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

**దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేస్తారు**

"బీజేపీది ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త గోల్వాల్కర్, మోహన్ భాగవత్, మనుస్మృతి భావజాలం. ఆ ఆలోచనా విధానం దేశాన్ని కాపాడదు. నాశనం చేస్తుంది. మోదీ, బీజేపీ అదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేస్తారు. హిందూ మతం, హిందుత్వం పేరుతో పేదలను బానిసలుగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారు" అని మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చే సమయానికి నరేంద్ర మోదీ, అమిత్ షా పుట్టారా అని నిలదీశారు. "బీజేపీ వాళ్లు ద్రోహులు, నాటకాలు ఆడేవారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రధాని మోదీ పార్లమెంటుకు రారు. మేము అడిగే ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పరు. వందే మాతరంపై దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు" అని నిప్పులు చెరిగారు. ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడాలంటే.. 'ఓట్ చోరీకి' పాల్పడుతున్న బీజేపీని అధికారం నుంచి తొలగించాలని పిలుపునిచ్చారు.

దేశాన్ని కాపాడగలిగేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని.. అందుకే కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ఐక్యంగా బలోపేతం చేయడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. "140 కోట్ల మంది ప్రజలను కాపాడటం ఎంతో ముఖ్యం. దేశంలో ధనవంతులు, పేదల మధ్య పోరా టం జరుగుతోంది. బీజేపీకి పేదల గోడు ఎప్పుడూ పట్టదు. కార్పొరేట్ శక్తులవైపే నిలుస్తుంది. ఆర్ఎస్ఎస్, బీజేపీ వంటి దేశద్రోహులు, ఓట్లను చోరీ చేసేవాళ్లకు వ్యతిరేకంగా మేం పోరాడుతున్నాం. ఈ పోరాటానికి మీరు మరింత బలోపేతం చేకూర్చాలి. గ్రామగ్రామానికీ వెళ్లి ఈ విషయాలు తెలియజేయాలి." అని ఖర్గే కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇక.. ఎన్నికల కమిషన్ సరిగా పనిచేయట్లేదనే విష యం దేశంలోని ప్రతిఒక్కరికీ తెలుసని ప్రియాంక గాంధీ అన్నారు. "ఎన్నికలకు ముందు ఒక్కొక్కరి ఖాతాలో రూ.10 వేలు వేయడం ఓట్ చోరీ కాదా?" అని ఆమె ప్రశ్నించారు. బిఆర్‌లో ఓట్ చోరీతోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. దమ్ముంటే.. బ్యాలెట్ విధానంలో పోటీ చేసి ఎన్నికల్లో గెలవాలని బీజేపీకి ఆమె సవాల్ విసిరారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలని ప్రియాంక పిలుపునిచ్చారు.

**అదే వారి సిద్ధాంతం..**


"ప్రపంచం సత్యం వైపు చూడదు. అధికారం వైపు మాత్రమే చూస్తుంది. అధికారం ఉన్నవాడినే గౌరవిస్తుంది" అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలను రాహుల్ గుర్తు చేశారు. ఇదే మోహన్ భాగవత్ ఆలోచన, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమని విమర్శించారు. ప్రపంచంలోని ప్రతి మతం సత్యమే ప్రధానమని చెబుతుందని, కానీ.. సత్యానికి అర్థమేలేదని, అధికారమే కీలకమని మోహన్ భగవత్ అంటున్నారని మండిపడ్డారు. "ఈ దేశం 'సత్యం, శివం, సుందరం'.. 'సత్యమేవ జయతే' అనే తత్వాలపై ఆధారపడి నడుస్తుంది. చివరికి కాంగ్రెస్ సత్యం, అహింసతోనే మోదీని, బీజేపీని ఓడించి గద్దె దించుతుంది. దీనికోసం కాంగ్రెస్ శాంతియుత, ప్రజాస్వామిక పంథాలోనే పోరాటం సాగిస్తుంది. సత్యాన్ని ఆచరిస్తూ, సత్యాన్ని అంటిపెట్టుకుని, సత్యాన్ని ఆయుధంగా చేసుకుంటే నరేంద్ర మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ ను ఈ దేశం నుంచే తరిమెయ్యొచ్చు."" అని రాహుల్ గాంధీ అన్నారు. ఓట్ చోరీపై ఆధారాలతో సహా తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు. హరియాణా ఓటర్ల జాబితాలో ఒక బ్రెజిలియన్ మహిళ ఫోటో 22సార్లు ఎలా కనిపించిందో, అదే రాష్ట్రంలోని ఒకే పోలింగ్ బూత్‌లో ఒక మహిళ ఫోటో 200సార్లు ఎలా ఉందో, యూపీకి చెందిన బీజేపీ కార్యకర్తలు హరియాణా ఎన్నికల్లో ఎలా ఓటేశారో? తాళం వేసిన ఒకే ఇంట్లో 600, 700 మంది ఓట్లరు ఎలా ఉన్నారో? ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
15 డిసెంబర్
2025




# అధిక బరువు తగ్గాలని చూస్తున్నారా..? అయితే పాలను రోజూ ఏ సమయంలో తాగితే మంచిదో తెలుసుకోండి..!

మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పాలను తాగితే మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తుంటారు. పాలను సంపూర్ణ పౌష్టికాహారంగా చెబుతారు. ఎందుకంటే పాలలో మన శరీరానికి కావల్సిన దాదాపు అన్ని పోషకాలు ఉంటాయి. కనుకనే పాలను రోజూ తాగాలని సూచిస్తుంటారు. పాలలో అనేక పోషకాలు ఉంటాయి. రోజూ పాలను తాగడం వల్ల మన శరీరానికి కావల్సిన అన్ని పోషకాలను పొందవచ్చు. పాలలో ప్రోటీన్లు కూడా అధిక మొత్తంలోనే ఉంటాయి. ఒక కప్పు పాలను తాగడం వల్ల సుమారుగా 8 గ్రాముల ప్రోటీన్లు లభిస్తాయి. ప్రోటీన్లు మన శరీరానికి శక్తిని అందిస్తాయి. ఉత్సాహంగా, చురుగ్గా ఉండేలా చేస్తాయి. నీరసం, అలసటను తగ్గిస్తాయి. బద్దకం పోయేలా చేస్తాయి. కనుక పాలను రోజూ తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.



**ఉదయం పాలను తాగితే..**

శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసిన వారు పాలను తాగితే శక్తి లభిస్తుంది. దీంతో మళ్లీ ఉత్సాహంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. కండరాలు మరమ్మత్తులకు గురవుతాయి. కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. పాలను ఉదయం పూట తాగితే రోజంతా శక్తి స్థాయిలు శరీరంలో అధికంగా ఉంటాయి. దీంతో నీరసం, అలసట రావు. యాక్టివ్‌గా ఉంటారు. అలాగే పాలను ఉదయం తాగడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గడం తేలికవుతుంది. కనుక పాలను తాగితే బరువు తగ్గుతారనే చెప్పవచ్చు. ఇక పాలను తాగితే మన శరీరంలో జీఎల్‌పీ-1, పీవైవై, సీసీకే వంటి హార్మోన్ల ఉత్పత్తి పెరుగుతుంది. ఇవి ఆకలిని తగ్గిస్తాయి. దీని వల్ల మనం ఆహారం తక్కువగా తింటాం. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. కనుక బరువు తగ్గాలని చూస్తున్నవారు పాలను ఉదయం తాగితే మేలు జరుగుతుంది.

**రాత్రి పూట అయితే..**

పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం రోజూ రాత్రి నిద్రకు ముందు ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలను తాగాలి. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి తగ్గుతుంది. పాలలో ట్రిప్టోఫాన్, మెగ్నిషియం, మెలటోనిన్ అనే పోషకాలు ఉంటాయి. ఇవి నిద్ర చక్కగా పట్టేలా చేస్తాయి. మైండ్ రిలాక్స్ అయ్యేలా చూస్తాయి. దీంతో నిద్ర త్వరగా పడుతుంది. రోజూ పాలను తాగుతుంటే నిద్రలేమిని తగ్గించుకోవచ్చు. అలాగే మానసిక ఆరోగ్యం సైతం మెరుగు పడుతుంది. పాలను రాత్రి పూట సేవించడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో రాత్రి పూట మీరు నిద్రిస్తున్నా కూడా మీ శరీరం క్యాలరీలను ఖర్చుచేస్తుంది. దీంతో కొవ్వు కరిగి బరువు తగ్గుతారు. ఇలా బరువు తగ్గేందుకు పాలు ఎంతో దోహదం చేస్తాయి.

**ఏ సమయంలో తాగాలి..**

పాలలో క్యాల్షియం, విటమిన్ డి, లినోలినిక్ యాసిడ్ అధికంగా ఉంటాయి. ఇవి మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది. పాలను ఉదయం తాగడం వల్ల కండరాలు నిర్మాణమవుతాయి. కండరాలు మరమ్మత్తులకు గురవుతాయి. శరీరానికి శక్తి లభిస్తుంది. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. రోజంతా యాక్టివ్‌గా పనిచేయవచ్చు. పాలను రాత్రి పూట సేవిస్తే బరువు తగ్గడంతోపాటు నిద్ర సమస్యలు కూడా దూరమవుతాయి. అయితే రాత్రి పూట పాలను తాగేవారు కొవ్వు తీసిన పాలను తాగాలి. లేదంటే శరీరంలో కొవ్వు చేరుతుంది. పాలను రాత్రిపూట సేవిస్తే అందులో తేనె, మిరియాల పొడి, పసుపు వంటివి కలిపి తాగితే ఇంకా ఎంతో మేలు జరుగుతుంది. ఇలా పాలను రోజులో వివిధ సమయాల్లో తాగడం వల్ల భిన్నమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.

# శీతాకాలం.. పిల్లలను వ్యాధుల నుండి రక్షించడానికి ఇలా చేయండి..!



శీతాకాలంలో పిల్లలకు రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఎందుకంటే చలి కారణంగా చర్మం పొడిగా మారడం, శ్వాసకోశ సమస్యలు పెరగడం, వైరస్‌లు సులభంగా వ్యాప్తి చెందడం వంటివి జరుగుతాయి. దీనిని ఎదుర్కోవడానికి, వారికి విటమిన్లు, పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారం అం దించడం, తగినంత నిద్ర పోయేలా చూడటం, పరిశుభ్రత పాటించడం వంటివి చాలా ముఖ్యం. ఈ సీజన్‌లో మీ బిడ్డకు వెచ్చని దుస్తులు ధరించండి.

**పరిశుభ్రత**

శీతాకాలంలో పిల్లల పరిశుభ్రతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. చేతులు కడుక్కోవడం అలవాటు చేసుకోవడం వల్ల అనేక అనారోగ్యాలను నివారించవచ్చు. తినడానికి ముందు,తర్వాత చేతులు కడుక్కోవడం అలవాటు చేయించాలి. ఈ సమయంలో పిల్లల దుస్తులను శుభ్రంగా ఉంచండి. శీతాకాలంలో పిల్లలకు ఎప్పుడూ గోరువెచ్చని నీటితో స్నానం చేయడం నేర్పండి.

**పండ్లు, కూరగాయలు ఇవ్వండి**

శీతాకాలంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. దీని వలన పిల్లలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో మీ పిల్లల రోగనిరోధక శక్తిని పెంచడానికి వారికి నిమ్మకాయలు, పండ్లు, కూరగాయలు ఇవ్వండి.

**నీరు ఎక్కువగా తాగడం అలవాటు చేయండి**

శీతాకాలంలో చాలా మంది తక్కువ నీరు తాగడం వల్ల డీహైడ్రేషన్ ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్య పిల్లల్లో కూడా కనిపిస్తుంది. కాబట్టి, హైడ్రేషన్ పై శ్రద్ధ వహించండి. పిల్లలకు సూప్, జ్యూస్, గోరువెచ్చని నీరు అందించండి. మంచి ఆరోగ్యం కోసం, ప్రతి ఉదయం మీ బిడ్డకు గోరవెచ్చని నీరు ఇవ్వండి.

**రోగనిరోధక శక్తిని బలోపేతం చేయండి**

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పప్పుధాన్యాలు, ఆకుపచ్చ కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు, గుడ్లు, గింజలు వంటి పోషకమైన ఆహారాలను వారి ఆహారంలో చేర్చండి. జంక్ ఫుడ్‌ను నివారించండి. అలాగే, వారికి తగినంత నిద్ర, కొంత శారీరక శ్రమ ఉండేలా చూసుకోండి.

# చేతులు, కాళ్ళు తిమ్మిరిగా అనిపిస్తున్నాయా? ఇది తెలుసుకోండి..!

ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడం లేదా నిద్రపోవడం వల్ల చేతులు, కాళ్ళు తిమ్మిరికి కారణమవుతాయి. అంతేకాకుండా చేతులు, కాళ్ళ జలదరింపు లేదా తిమ్మిరి.. బలహీనత, పోషక లోపాలను సూచిస్తుంది. అయితే, ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే, అది తీవ్రమైన న్యూరోపతిగా అభివృద్ధి చెందుతుంది. అయితే, ఈ ముఖ్యమైన పోషకాలను తీసుకోవడం ద్వారా మీరు ఈ సమస్య నుండి భయటపడవచ్చు.



**విటమిన్ బి12**

విటమిన్ బి12 మన నరాలకు అత్యంత ముఖ్యమైన పోషకం. మన నరాలకు రక్షణ కవచాన్ని అందించడానికి మైలిన్ కోశం అనే పదార్థం అవసరం. విటమిన్ బి12 లోపం ఉంటే, శరీరంలో మైలిన్ కోశం ఏర్పడటం తగ్గుతుంది. ఈ నరాల పొర బలహీనపడటం ప్రారంభించినప్పుడు చేతులు, కాళ్ళలో తిమ్మిరి, జలదరింపు లేదా బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి. సాధారణంగా, న్యూరోపతి రోగులలో విటమిన్ బి12 లోపం కనిపిస్తుంది. విటమిన్ బి12 లోపాన్ని అధిగమించడానికి జున్ను, చేపలు, గుడ్లు, పెరుగు, పాలు, చికెన్ మొదలైనవి తినాలి.

**విటమిన్ బి1**

మన నరాలు సరిగ్గా పనిచేయడానికి నిరంతరం శక్తి అవసరం. విటమిన్ బి1 మన నరాలకు శక్తిని అందిస్తుంది. శరీరంలో దాని లోపం ఉంటే, మన నరాలు క్రమంగా బలహీనపడటం ప్రారంభిస్తాయి. దీని వలన కాళ్ళలో నొప్పి లేదా మంట వస్తుంది. విటమిన్ బి1 మన నరాలకు ఇంధనంగా పనిచేస్తుంది. నరాలలో సరైన మొత్తంలో లేకపోతే చేతులు, కాళ్ళలో తిమ్మిరి కనిపిస్తుంది. విటమిన్ బి1 కోసం పొద్దుతిరుగుడు విత్తనాలు, వేరుశెనగలు, బ్రౌన్ రైస్, కిడ్నీ బీన్స్ మొదలైనవి తినండి.

నరాల మరమ్మత్తుకు ఫోలిక్ ఆమ్లం చాలా అవసరం. ఫోలిక్ ఆమ్లం కోసం దుంపలు, బ్రోకలీ, ఆకుకూరలు, సిట్రస్ పండ్లు తినవచ్చు. మన నరాలను సడలించడానికి కొన్ని ఖనిజాలు చాలా ముఖ్యమైనవి. మెగ్నీషియం లోపం కారణంగా, మన శరీరంలో కాళ్ళలో తిమ్మిరి, స్ట్రైయిన్లు, దృఢత్వం సమస్య పెరగడం ప్రారంభమవుతుంది, దీని కారణంగా మన నరాల మీద ఒత్తిడి ఏర్పడుతుంది. న్యూరోపతి లక్షణాలు బయటపడటం ప్రారంభిస్తాయి. వైద్యుల ప్రకారం, మెగ్నీషియం కోసం పాలకూర, బాదం, పెరుగు, అరటిపండు, గుమ్మడికాయ గింజలను తీసుకోండి.

# మీ పిల్లలకు ఈ ఆహారాలను రోజూ పెట్టండి..

## ఇవి బ్రెయిన్ ఫుడ్స్.. వారి తెలివితేటలను పెంచుతాయి..!

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఎంతటి తీవ్రమైన పోటీ నెలకొందో అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా విద్య, ఉద్యోగ రంగాల్లో కొన్ని కోట్ల మంది ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఈ పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే ప్రతి ఒక్కరికి అద్భుతమైన నైపుణ్యాలు ఉండాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. స్కిల్స్ ఉంటే కానీ ఈ పోటీ ప్రపంచంలో నెట్టుకు రాలేకపోతున్నారు. అయితే ఒక మనిషికి స్కిల్స్ ఉండాలంటే అప్పటికప్పుడు అభివృద్ధి చెందడం కష్టం. వాటిని చిన్నప్పటి నుంచే వృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఈ విషయంలో తల్లిదండ్రులు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలు పెద్దయ్యాక ఎలాంటి స్కిల్‌ను అయినా సులభంగా నేర్చుకోవాలన్నా, అందరిలోనూ సులభంగా నెగ్గాలన్నా వారికి తెలివితేటలు వృద్ధి చెందేలా చూడాలి. అందుకు గాను పలు ఆహారాలు ఎంతో దోహదం చేస్తాయి. పిల్లలకు తల్లిదండ్రులు ఆ వయస్సు నుంచే రోజూ పలు ఆహారాలను పెడుతుండాలి. దీని వల్ల వారిలో మెదడు పనితీరు మెరుగు పడుతుంది. జ్ఞాపకశక్తి వృద్ధి చెంది తెలివితేటలు పెరుగుతాయి. చదువుల్లో రాణిస్తారు. పెద్దయ్యాక కూడా అన్నింట్లోనూ, అందరికన్నా ముందే ఉంటారు.




**చేపలు, కోడిగుడ్లు..**

పిల్లల మెదడు అభివృద్ధి చెందేలా చూడడంలో చేపలు ఎంతో దోహదం చేస్తాయి. చేపలను వారికి తరచూ పెట్టడం వల్ల వారి మెదడు వికసిస్తుంది. తెలివితేటలు వృద్ధి చెందుతాయి. పిల్లల మెదడుకు పదును పెట్టేందుకు చేపలు ఎంతగానో దోహదం చేస్తాయి. ముఖ్యంగా మంచినీటి లేదా సముద్రపు చేపలను వారికి తినిపించాలి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి పిల్లల మెదడు పనితీరును మెరుగు పరచడంలో ఎంతో సహాయం చేస్తాయి. దీని వల్ల వారి మెదడు యాక్టివ్‌గా మారి ఉత్సాహంగా ఉంటారు. అన్నింట్లోనూ తెలివితేటలను కనబరుస్తారు. అలాగే పెద్దయ్యాక కూడా మిక్కిలి ప్రతిభావంతులుగా మారుతారు. ఇక పిల్లల తెలివితేటలు పెరగాలంటే వారికి రోజూ ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తినిపించినా ఎంతో మేలు జరుగుతుంది. కోడిగుడ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, కోలిన్, లుటీన్, జింక్ వంటి పోషకాలు గుడ్లలో ఉంటాయి. ఇవి పిల్లల్లో యాక్టివ్‌నెస్‌ను పెంచుతాయి. బద్దకం పోయేలా చేస్తాయి. దీంతో వారి మెదడు వికసిస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదువుతోపాటు ఇతర అంశాల్లోనూ రాణిస్తారు. పెద్దయ్యాక ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు.

**పెరుగు..**

పిల్లల మెదడు అభివృద్ధికి పెరుగు సైతం దోహదం చేస్తుంది. పెరుగును రోజూ వారికి తినిపించాలి. ఇది మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల మెదడుకు అలర్ట్‌నెస్ పెరుగుతుంది. దీంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి చిన్నారులు ఏ విషయాన్నయినా ఇట్టే నేర్చుకుంటారు. అలాగే చిన్నారులకు పాలకూర, అరటికాయలు, బ్రోకలీ, ఆకుకూరలు వంటి వాటిని కూడా పెడుతుండాలి. ముఖ్యంగా టమాటాలు, బ్లూ బెర్రీలు, బ్లాక్ బెర్రీల వంటి వాటిని వారికి తినిపిస్తుండాలి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి మెదడు కణాలను రక్షిస్తాయి. దీంతో మెదడు యాక్టివ్‌గా మారి వారు చదువుల్లో రాణిస్తారు. ఇక పిల్లల ఆరోగ్యం కోసం తృణ ధాన్యాలను కూడా వారికి ఇవ్వాల్సి ఉంటుంది. ఓట్స్, బ్రౌన్ రైస్, కినోవా వంటి ఆహారాలను పెడుతుంటే వారికి నిరంతరం శక్తి లభిస్తుంది. దీని కారణంగా వారు ఎల్లప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. నీరసం, అలసట రావు. బద్దకం పోతుంది. వారు అన్నింట్లోనూ చురుగ్గా ఉంటారు. ప్రతిభ కనబరుస్తారు.

**విటమిన్ ఇ..**

పిల్లల మెదడు ఆరోగ్యానికి విటమిన్ ఇ కూడా దోహదం చేస్తుంది. ఇది ఎక్కువగా బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలు వంటి వాటిల్లో లభిస్తుంది. కనుక వీటిని పిల్లలకు పెడుతుంటే ఉపయోగం ఉంటుంది. అయితే వీటిని నేరుగా తినిపించకూడదు. నీటిలో నానబెట్టి తినిపించాలి. లేదంటే ఇవి పిల్లల్లో వికారం, వాంతులను కలగజేసే అవకాశం ఉంటుంది. అయితే న్యూట్రిషనిస్టు లేదా డాక్టర్‌ను కలిసి వీటిని పిల్లలకు తినిపిస్తే మంచిది. ఎందుకంటే కొందరికి పలు ఆహారాల వల్ల అలర్జీలు సంభవించే ప్రమాదం ఉంటుంది. కనుక మీ పిల్లలకు ఎలాంటి ఫుడ్స్ పడతాయి అనే విషయాన్ని తెలుసుకుని ఆ ప్రకారం వారికి ఆహారాలను పెడితే దీంతో వారి మెదడు యాక్టివ్‌గా మారి వారి తెలివితేటలు పెరుగుతాయి. దీని వల్ల వారు అన్నింట్లోనూ రాణిస్తారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
15 డిసెంబర్
2025





# మూడో టీ20లో దక్షిణాఫ్రికా చిత్తు

## అవలీలగా ఆడేశారు.. బౌలర్ల విజృంభణ.. అభిషేక్ జోరు




**ధర్మశాల:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీసలో టీమిండియా మరోసారి ఆధిపత్యం ప్రదర్శించింది. ఆదివారం జరిగిన మూడో టీ20లో బౌలర్లు విశేషంగా రాణించడంతో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో ఈ సిరీసలో 2-1తో ముందంజ వేసింది. నాలుగో టీ20 బుధవారం లఖ్‌నవూలో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మార్‌క్రమ్ (46 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 61) అర్ధసెంచరీ సాధించగా.. ఫెరీరా (20), నోకియా (12) రెండంకెల స్కోర్లు సాధించిన మరో ఇద్దరు ఆటగాళ్లు. ఆ తర్వాత ఛేదనలో భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 120 పరుగులు చేసి నెగ్గింది. అభిషేక్ (18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 35), గిల్ (28), తిలక్ (25 నాటౌట్) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అర్ష్‌దీప్ (2/13) నిలిచాడు. మరోవైపు పేసర్ బుమ్రా వ్యక్తిగత కారణాలరీత్యా ముంబైకి వెళ్లగా, స్పిన్నర్ అక్షర్ అనారోగ్యంతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. వీరి స్థానాల్లో హర్షిత్, కుల్దీప్ భారత జట్టులోకి వచ్చారు.

**ఓపెనర్ల జోరు: స్వల్ప ఛేదన..**

పైగా మంచు ప్రభావం. దీంతో భారత ఓపెనర్లు కసిదీరా బంతిని బాదేస్తూ చకచకా లక్ష్యాన్ని కరిగించారు. మధ్య ఓవర్లలో సఫారీ బౌలర్లు ప్రభావం చూపినా ఫలితం లేకపోయింది. తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన అభిషేక్ తన ఉద్దేశాన్ని చాటగా.. అటు ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడిన గిల్ సైతం ధాటిని కనబర్చాడు. అయితే ఖాతా తెరువకముందే అతడిని అంపైర్ ఎల్బీగా ప్రకటించగా.. రివ్యూ కోరి బతికిపోయాడు. యాన్సెన్ వేసిన బంతి ముందుగా బ్యాట్‌కు టచ్ అయినట్టు తేలింది. ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకుంటూ ఆ తర్వాత బౌండరీలతో చెలరేగాడు. అటు అభిషేక్ ప్రతీ బంతిని బాదడమే లక్ష్యంగా దూసుకెళ్లాడు. అయితే ఆరో ఓవర్‌లో అతడి క్యాచ్‌ను కవర్స్ నుంచి వెనక్కి పరిగెడుతూ మార్‌క్రమ్ అద్భుతంగా పట్టేశాడు. దీంతో తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వచ్చీ రావడంతోనే తిలక్ రెండు ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 68/1 స్కోరుతో నిలిచింది. అయితే ఆ తర్వాత సఫారీ బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు నెమ్మదించాయి. షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడిన గిల్‌ను 12వ ఓవర్‌లో యాన్సెన్ బౌల్డ్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 32 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక కెప్టెన్ సూర్య (12) రెండు వరుస ఫోర్లతో ఊపు చూపినా మరో భారీ షాట్‌కు వెళ్లి బార్ట్‌మన్‌కు దొరికిపోయాడు. అప్పటికి 32 బంతుల్లో 9 రన్స్ కావాల్సి ఉండడంతో దూబే (10 నాటౌట్) 6,4తో మరో 25 బంతులుండగానే భారత్ మ్యాచ్‌ను ముగించింది.

**వికెట్లు టపటపా:**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు తొలి ఓవర్ నుంచే కష్టాలు ఆరంభమయ్యాయి. కొత్త బంతితో ఇరువైపులా స్వింగ్‌ను రాబట్టిన పేసర్లు అర్ష్‌దీప్, హర్షిత్ అదరగొట్టారు. అటు స్పిన్నర్లు సైతం విశేషంగా రాణించడంతో 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అయితే కెప్టెన్ మార్‌క్రమ్ ఒక్కడే నిలబడి కాస్త పరువు కాపాడాడు. కానీ మరో ఎండ్‌లో సఫారీ బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (0)ను తొలి ఓవర్‌లోనే పేసర్ అర్ష్‌దీప్ అవుట్ చేశాడు. ఇక హర్షిత్ తన వరుస ఓవర్లలో మరో ఓపెనర్ డికాక్ (1), బ్రెవిస్ (2)ను అవుట్ చేయడంతో 7 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. అటు మార్‌క్రమ్ ఓపిగ్గా క్రీజులో నిలిచి బౌలర్లను ఎదుర్కొంటున్నా అతడికి సహకారమే కరువైంది. నాలుగో వికెట్‌కు 23 పరుగులు జత చేశాక స్టబ్స్ (9) వెనుదిరిగాడు. ఆ తర్వాత బాష్ (4) కూడా నిరాశపర్చగా.. ఫెరీరా కాసేపు మార్‌క్రమ్‌కు అండగా నిలిచాడు. ఒక ఫోర్, ఒక సిక్సర్‌తో ఆకట్టుకున్న తనను వరుణ్ బౌల్డ్ చేయడంతో ఆరో వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తన తర్వాతి ఓవర్‌లోనే యాన్సెన్ (2)ను కూడా వరుణ్ బౌల్డ్ చేశాడు. చివర్లో జోరు పెంచిన మార్‌క్రమ్ 4,6,6తో 18వ ఓవర్‌లో 19 పరుగులతో జట్టు స్కోరును వంద దాటించాడు. అలాగే 41 బంతుల్లో తన ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే మార్‌క్రమ్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో ఆ కాస్త జోష్ కూడా ముగిసినట్టయ్యింది. చివరి ఓవర్‌లో స్పిన్నర్ కుల్దీప్ రెండు వికెట్లతో ప్రత్యర్థిని ఆలౌట్ చేశాడు.

పురుషుల టీ20ల్లో 1000ం రన్స్‌తో పాటు 100 వికెట్లు తీసిన తొలి పేసర్‌గా హార్దిక్ పాండ్యా. ఓవరాల్‌గా నాలుగో ప్లేయర్. ఇక భారత్ నుంచి అర్ష్‌దీప్, బుమ్రా ఇప్పటికే వంద వికెట్లు తీసిన వారిలో ఉన్నారు.

1 పురుషుల టీ20ల్లో 1000ం రన్స్‌తో పాటు 100 వికెట్లు తీసిన తొలి పేసర్‌గా హార్దిక్ పాండ్యా. ఓవరాల్‌గా నాలుగో ప్లేయర్. ఇక భారత్ నుంచి అర్ష్‌దీప్, బుమ్రా ఇప్పటికే వంద వికెట్లు తీసిన వారిలో ఉన్నారు.

2 తక్కువ ఇన్నింగ్స్ (32)లోనే 50 టీ20 వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా వరుణ్. కుల్దీప్ (30) టాప్‌లో ఉన్నాడు.

# మెస్సీ మెరిసె.. ముంబై మురిసె

## ప్రత్యేక ఆకర్షణగా సచిన్.. పోటెత్తిన అభిమానులు



ముంబై: అర్జెంటీనా సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ ఫీవర్ కలల నగరాన్ని కుదిపేసింది. మెస్సీ.. మెస్సీ నామస్మరణతో సిటీ మొత్తం సందడి వాతావరణం నెలకొంది. 'గోట్' ఇండియా టూర్‌లో భాగంగా మూడో అంచె అయిన ముంబైలో మెస్సీ ఆదివారం పర్యటించాడు. అయితే, దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, మెస్సీ వాంఖడేలో కలవడం ఈ పర్యటనకే హైలైట్. అతడి రాక కోసం ఎదురుచూస్తున్న ఫ్యాన్స్ స్టేడియానికి పోటెత్తారు. ఆదివారం మధ్యాహ్నం మెస్సీ ఇక్కడకు చేరుకొన్నాడు. ప్రముఖ ఫుట్‌బాలర్లు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ కూడా అతడి వెంటే వచ్చారు. గంటపాటు వాంఖడేలో మెస్సీ అండ్ కో సందడి చేశారు. భారత మాజీ ఫుట్‌బాలర్ సునీల్ చెత్రి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ ఫుట్‌బాలర్లలోని ప్రతిభను వెలికితీయడానికి 'ప్రాజెక్ట్ మహాదేవ'ను ప్రారంభిస్తున్నట్టు ఫడణవీస్ ప్రకటించారు. మెస్సీని వె-ంమెంటోతో సత్కరించారు. లియోకు చెత్రి జెర్సీని బహూకరించగా.. అతడు కూడా సునీల్‌కు అదే గిఫ్ట్‌ను ఇచ్చాడు. సోమవారం ఢిల్లీ లెగ్‌తో లియోనెల్ భారత పర్యటన ముగియనుంది.

**కూల్‌గా హుషారుగా..**

మెస్సీ ఎంతో కూల్‌గా కనిపించాడు. రెడ్ కార్పెట్‌పై నడుచుకుంటూ వస్తూనే ఫ్యాన్స్‌కు చేతులు ఊపుతూ పలకరించాడు. ఫడణవీస్, సచిన్‌తోపాటు బాలీవుడ్ నటులు అజయ్ దేవగన్, టైగర్ ష్రాఫ్ తదితరులు కూడా మెస్సీతో కలిశారు. ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడే ప్లేయర్లను పలకరించిన అనంతరం.. హైదరాబాద్ తరహాలో ఫుట్‌బాల్‌ను స్టాండ్స్‌లోకి కొట్టిన లియోనెల్, సువారెజ్, డి పాల్ ఆ తర్వాత మైదానం అంతా కలియదిరిగారు. ఆ తర్వాత 7-7 ఎగ్జిబిషన్ మ్యాచ్ జరిగింది. యువ ఆటగాళ్లతో ప్రాక్టీస్ చేయించారు. వాంఖడే కంటే ముందు పడేల్ కప్ ఈవెంట్ కోసం బ్రబౌర్న్ స్టేడియాన్ని మెస్సీ సందర్శించాడు.

**అందుకే ఇక్కడ మ్యాచ్‌లు ఆడలేదు**

కోల్‌కతా: సాకర్ లెజెండ్ మెస్సీ భారత పర్యటనలో ఒక్క క్లబ్ మ్యాచ్ కానీ, అంతర్జాతీయ స్థాయి పోటీలో కానీ




పాల్గొనక పోవడం కోట్లాదిమంది భారత అభిమానులను నిరాశ పరుస్తోంది. ఇంత వ్యయప్రయాసలతో ఏర్పాటు చేసిన మూడు రోజుల టూర్‌లో అతడు ఒక్క మ్యాచ్ కూడా ఆడక పోవడమేమిటనే సందేహం కలుగుతోంది. 38 ఏళ్ల లియోనెల్ ప్రపంచంలో అత్యంత అధిక మొత్తం బీమా కలిగిన ఆటగాడు. అతడి ఎడమ పాదం బీమా విలువ తెలిస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. అది ఎంత మొత్తమంటే.. 8,153 కోట్లు! పోటీల సందర్భంగా కెరీర్‌కు ముప్పు తెచ్చే గాయాల వల్ల ఏర్పడే ఆర్థిక నష్టం నుంచి ఈ బీమా మె-స్సీకి రక్షణ కల్పిస్తుంది. అందువల్ల..క్లబ్ లేదా దేశానికి చెందని మ్యాచుల్లో ఆ ప్లేయర్ పాల్గొనడు. అర్జెంటీనా జాతీయ జట్టుకు ఆడే లియోనెల్ క్లబ్ స్థాయిలో ఇంటర్ మియామీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇంకా..ఎగ్జిబిషన్ మ్యాచ్‌లకు బీమా పాలసీ వర్తించదు. ఒకవేళ ఈ మ్యాచ్‌ల సందర్భంగా ఆటగాడు గాయపడితే అతడు వేల కోట్ల రూపాయల బీమా పరిహారాన్ని కోల్పోవాల్సి ఉంది. ఇదీ.. భారత్‌లో మెస్సీ మ్యాచ్‌లు ఆడకపోవడం వెనకున్న సీక్రెట్. అయితే దిగ్గజ బాస్కెట్‌బాలర్ మైకేల్ జోర్డాన్‌కు చికాగో బుల్స్‌తో ఉన్న ఒప్పందంలో 'లవ్ ఆఫ్ ది గేమ్' అనే క్లాజ్ ఉంది. ఆ క్లాజ్ ప్రకారం అతడు తన జట్టు అనుమతిలేకుండా ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరితోనైనా బాస్కెట్‌బాల్ మ్యాచ్ ఆడొచ్చు. ఈ మ్యాచ్‌ల సమయంలో జోర్డాన్‌కు గాయం అయినా చికాగో బుల్స్ జట్టు అతడికి పరిహారం చెల్లిస్తుంది. కానీ మెస్సీ బీమా పాలసీలో అటువంటి క్లాజ్ లేదట!

## ఆఖరి రోజు మెస్సీ ఇలా..

**నేడు ఢిల్లీలో ప్రధాని మోదీ, సీజేఐ, ఆర్మీచీఫ్‌లతో భేటీ**

**అరుణ్ జైట్లీ స్టేడియంలో ఈవెంట్‌కు హాజరు**

**న్యూఢిల్లీ:** గోట్ టూర్‌లో భాగంగా మెస్సీ ఇప్పటికే కోల్‌కతా, హైదరాబాద్, ముంబై నగరాలను చుట్టేశాడు. ఇక ఆఖరి, మూడోరోజైన సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో అభిమానులను అలరించి తన పర్యటనకు ముగింపు పలకనున్నాడు. మరి.. చివరిరోజు మెస్సీ ఏం చేయనున్నాడు..? ఎవరిని కలవనున్నాడు..? అంటే.. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్‌లో ఇప్పుడు కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు మరికొందరు అత్యంత ప్రముఖులతో మెస్సీ భేటీ కానున్నాడు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం.

ఉదయం 10.45 గంటలకు ఢిల్లీలో అడుగుపెట్టనున్న మెస్సీ.. ముందుగా నగరంలోని ఓ హోటల్‌లో 50 నిమిషాల పాటు మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటాడు. అనంతరం ప్రధానమంత్రి నివాసంలో నరేంద్ర మోదీతో 20 నిమిషాలు సమావేశం కానున్నాడు.

మోదీతో భేటీ అనంతరం ఎంపీ, జాతీయ ఫుట్‌బాల్ సంఘం మాజీ చీఫ్ ప్రఫుల్ పటేల్ నివాసానికి మెస్సీ వెళ్లనున్నాడు. భారత్‌లో అర్జెంటీనా రాయబారి మరియానో అగస్టిన్ కాసినోతో పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చీఫ్ రాహుల్ నవీన్‌లాంటి అత్యంత ప్రముఖులను అక్కడ కలుసుకుంటాడు.

మధ్యాహ్నం 3.30కు ఫిరోజ్ షా కోట్లా (అరుణ్ జైట్లీ స్టేడియం) స్టేడియానికి చేరుకోనున్న మెస్సీ.. కొందరు క్రికెట్, సినీ సెలెబ్రిటీలతో కలిసి ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడతాడు. మధ్యాహ్నం 3.55 నుంచి సాయంత్రం 4.15 గంటల దాకా 22 మంది చిన్నారులతో కలిసి ఫుట్‌బాల్ క్లినిక్‌లో పాల్గొంటాడు.




# పాక్‌ను చిత్తుచేశారు..

## యువ భారత్ ఘన విజయం

### దీపేష్, కనిష్క్ విజృంభణ

దుబాయ్: భారత బౌలర్లు దీపేష్ దేవేంద్రన్ (3/16), కనిష్క్ చౌహాన్ (3/33) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను యువ భారత్ మట్టికరిపించింది. అండర్-19 ఆసియాకప్ గ్రూప్-ఎలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 90 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తు చేసి, వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. భారత్, పాక్ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో కూడా పరస్పరం కరచాలనం చేసుకోలేదు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించగా.. తొలుత భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆరోన్ జార్జ్ (85) అర్ధ శతకం నమోదు చేయగా.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కనిష్క్ (46) బ్యాట్‌తోనూ రాణించాడు. మహ్మద్ సయ్యమ్, అబ్దుల్ సుభాన్ చెరో మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో పాక్ 41.2 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. హుజైఫా ఎహ్‌సాన్ (70) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కిషన్ సింగ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

**నిరాశపర్చిన వైభవ్:**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టిదెబ్బ తగిలింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (5)ని సయ్యమ్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపాడు. అయితే, కెప్టెన్ ఆయుష్ మాత్రే (38), ఆరోన్ రెండో వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఆయుష్‌ను సయ్యమ్ అవుట్ చేయగా.. విహాన్ మల్హోత్రా (12), వేదాంత్ త్రివేది (7) స్వల్ప స్కోరుకే వెనుదిరిగారు. కానీ, అభిజ్ఞాన్ కుందూ (22)తో కలిసి ఆరోన్ ఐదో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు. కుందూ, ఆరోన్‌ను సుభాన్ అవుట్ చేసినా.. ఖిలన్ (6), హనిల్ (12) అండతో కనిష్క్ టీమ్‌కు పోరాడగలిగే స్కోరును అందించాడు.

# స్క్వాష్ వరల్డ్ కప్ మనదే




చెన్నై: స్క్వాష్ వరల్డ్‌లో భారత్ చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్‌ను చిత్తు చేసింది. తద్వారా ప్రతిష్ఠాత్మక టైటిల్ అందుకున్న తొలి ఆసియా దేశంగా రికార్డు నెలకొల్పింది. 2023లో సాధించిన కాంస్యమే ఈ టోర్నీ చరిత్రలో మనోళ్ల అత్యుత్తమ ప్రదర్శన. ఈసారి టోర్నమెంట్‌లో రెండో సీడ్‌గా బరిలోకి దిగిన భారత్ ఒక్క మ్యాచ్ కూడా చేజార్చుకోకుండా విజేతగా నిలవడం విశేషం. గ్రూపు దశలో స్విట్జర్లాండ్, బ్రెజిల్‌లను ఓడించిన మనోళ్లు.. క్వార్టర్స్‌లో దక్షిణాఫ్రికాపై, సెమీస్‌లో రెండుసార్లు చాంపియన్ ఈజిప్టుపై విజయం సాధించారు.

# సహానా సహానా..

## ప్రభాస్-నిధి జంటపై క్రేజీ సాంగ్

2026 సంక్రాంతి బరిలో విడుదల కానున్న మోస్ట్ అవైటెడ్ చిత్రాలలో ఒకటి -రాజా సాబ్. ప్రభాస్- మారుతి రేర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలన్న ఉత్సాహం అందరిలో ఉంది. చిత్రబృందం ఇప్పటికే ప్రచారంలో వేగం పెంచింది. ఈ సినిమాలోని రెండో పాట విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని మేకర్స్ ఇంతకుముందు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం చిత్ర బృందం తమన్ స్వరపరిచిన -సహనా సహనా- అనే రెండో సింగిల్ ప్రోమోను విడుదల చేసింది. ఈ పాటను స్పెయిన్‌లోని సుందరమైన లొకేషన్లలో చిత్రీకరించారు. అందమైన ప్రకృతి, సరస్సు సమీపంలో చిత్రీకరించిన వీడియో గ్లింప్స్ యూత్ లోకి వేగంగా దూసుకెళ్లింది. పూర్తి వీడియో సాంగ్ డిసెంబర్ 17 2025 సాయంత్రం 6:35 గంటలకు విడుదల కానుంది. ఈ పాటను ప్రభాస్ - నిధి అగర్వాల్ జంటపై చిత్రీకరించారు. ఆ ఇరువురి నడుమా కెమిస్ట్రీ ఒక రేంజులో వర్కవుటైందని ఈ విజువల్ చెబుతోంది. తాజాగా రిలీజ్ చేసిన ప్రోమో ఎంతో ప్లెజెంట్ గా ఆకట్టుకుంది. రెండు లైన్ల సాహిత్యంతో ఈ పాట రేంజ్ ఏంటో అందరికీ అర్థమైంది. ఈ పాటలో ప్రభాస్ పూర్తి వైట్ అండ్ వైట్ దుస్తులలో కనిపించగా, నిధి అగర్వాల్ పసుపు రంగు దుస్తులలో ఎంతో అందంగా కనిపిస్తోంది. ఈ పాట పూర్తి వెర్షన్ ఫ్యాన్స్ కి స్పెషల్ ట్రీట్ గా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ హారర్ కామెడీ చిత్రాన్ని నిర్మించింది. మాళవిక మోహనన్ ఈ చిత్రంలో కథానాయిక. రిద్ధి కుమార్, సంజయ్ దత్, సత్య తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# దేఖ్‌లేంగే సాలా.. 24 గంటల్లో 3కోట్ల వీక్షణలతో రికార్డ్!



పవర్‌స్టార్ పవన్ కల్యాణ్- డిఎస్‌పి కాంబినేషన్ మరోసారి మ్యాజిక్ క్రియేట్ చేసింది. డిఎస్.పి మ్యాజికల్ ట్యూన్.. దానికి తగ్గట్టు పవన్ డ్యాన్సుల్లో గ్రేస్ ఇప్పుడు రికార్డుల గురించి మాట్లాడుకునేలా చేస్తున్నాయి. -గబ్బర్ సింగ్- పాటల తర్వాత మళ్లీ -ఉస్తాద్ భగత్ సింగ్-పాటల గురించి తెలుగు ప్రజల్లో ఉత్సుకత పెరిగింది. దానికి కారణం -దేఖ్ లేంగే సాలా-. గబ్బర్ సింగ్ కాంబినేషన్ లో రూపొందుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ ఆల్బమ్ లోని ఒక పాట ఫిలిం సర్కిల్స్ తో పాటు, ప్రజల్లోను ఉత్సుకతను పెంచాయి. తాజా సమాచారం మేరకు, -దేఖ్‌లేంగే సాలా- పాట చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లోనే 29.6 మిలియన్లకు పైగా వీక్షణలతో రికార్డులను బద్దలు కొట్టింది. ఇటీవలి కాలంలో ఈ స్థాయిలో వేవ్ క్రియేట్ చేసిన పాట మరొకటి లేదు. ప్రపంచవ్యాప్తంగా వైరల్ గా దూసుకెళుతున్న యూనిక్ సాంగ్ ఇది. చాలా కాలంగా రొటీన్ ట్యూన్స్ తో విసిగించిన డిఎస్‌పి మరోసారి మనసు పెట్టి ఈ పాట కోసం పని చేసాడని అర్థమవుతోంది. ఈ పాట ట్యూన్ కు తగ్గట్టే పవన్ స్టెప్పులు కూడా ఆడియెన్ ని ఆకర్షించాయి. ముఖ్యంగా దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ గొప్ప ప్రశంసలను అందుకుంది. భాస్కరభట్ల సాహిత్యం అదనపు బలం అనడంలో సందేహం లేదు. హరీష్ శంకర్ విజన్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి సెట్లు, డిజైనర్ నీతా లుల్లా కాస్ట్యూమ్ వర్క్, రవి వర్మన్ సినిమాటోగ్రఫీ ఇవన్నీ ఉస్తాద్ కి అదనపు బలాలు అనడంలో సందేహం లేదు. టాలీవుడ్ లో గబ్బర్ సింగ్ తర్వాత మళ్లీ అలాంటి విజువల్ ట్రీట్ ని పవన్ అభిమానులు ఆస్వాదించబోతున్నారనే పాజిటివిటీని దేఖ్ లేంగే పాట తీసుకుని వచ్చింది. -దేఖ్ లేంగే- పాటకు దక్కుతున్న ఆదరణ నిజానికి ఈ సినిమా మేకర్స్‌లోను కొత్త ఉత్సాహం నింపింది. ఈ పాటను పాడినది విశాల్ దద్లాని- హరిప్రియ. భాస్కరబట్ల సాహిత్యం అందించగా, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. సంగీతం- కొరియోగ్రఫీ సరిగ్గా సెట్టయితే మ్యాజిక్ ఎలా ఉంటుందో ఈ పాట నిరూపిస్తోంది.

# ట్రెడిషనల్ లుక్లో కట్టిపడేస్తోందిగా..

టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్గా ఎంట్రీ ఇచ్చి, అతి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్గా ఎదిగారు శ్రీలీల. తన ఎనర్జిటిక్ స్టెప్పులతో, క్యూట్ ఎక్స్ప్రెషన్స్తో కుర్రాళ్ళ మనసు దోచుకున్న ఈ భామ, గ్లామర్ విషయంలోనూ ఏమాత్రం తీసిపోరు. మోడ్రన్ డ్రెస్సుల్లో ఎంత ట్రెండీగా కనిపిస్తారో, సంప్రదాయ దుస్తుల్లో అంతకంటే అందంగా కనిపిస్తారని నిరూపించారు.

లేటెస్ట్ గా శ్రీలీల షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. క్రీమ్ కలర్ డిజైనర్ లెహంగాలో ఆమె అచ్చం దేవకన్యలా మెరిసిపోతున్నారు. ఆ దుస్తులపై ఉన్న షైనింగ్, ఆమె చర్మానికి తగ్గట్టుగా బ్లెండ్ అయ్యి, ఒక పాలరాతి శిల్పంలా కనిపిస్తున్నారు. సింపుల్గా కనిపిస్తూనే ఎంతో రాయల్ లుక్కు సొంతం చేసుకున్నారు. ఈ లుక్లో శ్రీలీల ధరించిన ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మెడలో హెవీ డైమండ్ సెట్, చెవులకు మ్యాచింగ్ ఇయర్ రింగ్స్, నుదుటిన పాపిట బిళ్ళతో ఆమె అలంకరణ అదిరిపోయింది. జడలో మల్లెపూలు పెట్టుకుని, వాటి సువాసనలు వెదజల్లుతున్నట్లుగా ఆమె ఇచ్చిన పోజులు చూస్తుంటే ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. గతంలో ఎక్కువగా గ్లామర్ పాత్రల్లో, మాస్ బీట్స్కే పరిమితమైన శ్రీలీల, ఇలా క్లాసీ లుక్లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమె కళ్ళలోని మెరుపు, పెదాలపై చిరునవ్వు ఫ్యాన్స్ను కట్టిపడేస్తున్నాయి. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు ఆమెను బాపు బొమ్మతో పోలుస్తూ కామెంట్స్ చేస్తున్నారు.



# బచ్చన్ బ్యూటీకి లక్కీ ఛాన్స్..!

మిస్టర్ బచ్చన్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన భాగ్య శ్రీ బోర్స్ సక్సెస్ లు ఉన్నా లేకపోయినా సరే అమ్మడికి అవకాశాలు మాత్రం వరుసగా వస్తున్నాయి. మిస్టర్ బచ్చన్ తర్వాత కింగ్డం వచ్చి నిరాశపరచింది. ఐతే రీసెంట్ గా అమ్మడు రెండు వారాల గ్యాప్ లోనే రెండు సినిమాలతో వచ్చింది. అందులో ఒకటి కాంత కాగా రెండోది ఆంధ్ర కింగ్ తాలూకా. ఈ సినిమాల కమర్షియల్ లెక్కలు ఎలా ఉన్నా రెండిటిలో భాగ్య శ్రీ గ్లామర్ తో పాటు యాక్టింగ్ కూడా ఇంప్రెస్ చేసింది.

తనలోని నటిని పరిచయం చేసిన భాగ్య శ్రీకి మరిన్ని ఛాన్స్ లు వస్తున్నాయి. ఆల్రెడీ అమ్మడు మరో రెండు సినిమాల్లో డిక్షన్ లో ఉందని తెలుస్తుంది. ఐతే లేటెస్ట్ గా స్వప్న సినిమా బ్యానర్ లో నూతన దర్శకుడు చేస్తున్న ఒక ఫిమేల్ సెంట్రిక్ సినిమాలో హీరోయిన్ గా భాగ్య శ్రీ ఎంపికైందని తెలుస్తుంది. భాగ్య శ్రీకి ఇది నిజంగానే లక్కీ ఛాన్స్ అని చెప్పొచ్చు. ఎందుకంటే వైజయంతి బ్యానర్, స్వప్న సినిమాస్ లో సినిమా అంటే టాప్ క్లాస్ లెవెల్ లో ఉంటాయి.

అందులోనూ లేడీ ఓరియెంటెడ్ సినిమా అంటే ఆ లెక్క వేరే ఉంటుంది. కెరీర్ ఎర్లీ స్టేజ్ లోనే భాగ్య శ్రీకి ఈ ఛాన్స్ నిజంగానే లక్కీ అని చెప్పొచ్చు. రమేష్ అనే నూతన దర్శకుడు ఈ సినిమాను కంప్లీట్ గా డిఫరెంట్ స్టోరీతో తెరకెక్కించే ప్లాన్ లో ఉన్నాడట. ఆంధ్రా కింగ్ తాలూకాతో ఆడియన్స్ ని ఇంప్రెస్ చేసిన భాగ్య శ్రీ ఈ సినిమాతో మరోసారి తన టాలెంట్ చూపించాలని చూస్తుంది. భాగ్య శ్రీ బోర్స్ కూడా కెరీర్ లో తన సత్తా చాటే ఒక పాత్ర కోసం ఎదురుచూస్తుంది. ఐతే స్వప్న సినిమాస్ అలాంటి కథతోనే వచ్చారని తెలుస్తుంది. ఈ సినిమాకు టైటిల్ గా చుక్కలు తెమ్మన్నా తెంచుకు రానా అని ఫిక్స్ చేశారట. ఐతే ఈ సినిమాలో భాగ్య శ్రీకి పెయిర్ గా నటించే హీరో ఎవరన్నది ఇంకా క్లారిటీ రాలేదు.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986